

మహామాయ ..... 16
రణరంగం
డిటెక్టివ్ & మిస్టరి నవల
రచన

మహామాయ-16

# రణరంగం

రచన

కనకమేడల

VIGNANA SAHITI
MADRAS-17

ప్రథమ ముద్రణ
ఏప్రిల్ 1957

పాఠకులకు, ఏజెంట్లకు

కథానిక విషయంలో మీరు చూపిన విశేషాదరణకు ధన్యవాదాలు.

మే నెల పత్రికకు ఇంకా ఆర్డర్లు పంపని ఏజెంట్లు వెంటనే పంపాలి.

మే నెల నుండి కథానిక వెల 40 నయా పైసాలు; అరణాలు కాదు; గమనించ ప్రార్థన. అరణాల చొప్పున డబ్బు పంపిన ఏజెంట్లు వచ్చే నెలలో మిగిలిన పైకం పంపవలసిందిగా కోరుతున్నాం.

కథానికకు ఏజెంట్లుగాని తదితరులుగాని స్థానిక వ్యాపార సంస్థల ప్రకటనలను పంపితే కమిషన్ ఇస్తాం. వివరాలకు లోపల ఉన్న ప్రకటన రేట్ల పట్టిక చూడ వచ్చును.

అభివందనాలతో,
డైరెక్టర్

వెల
0-8-0

ముద్రణ
సాహితీ ప్రింటర్స్
మద్రాసు-17

యమదూత ఎలాగో శ్రమపడి నరసింగ భూపతిని ఖైదునుండి విడిపించి భూగృహానికి చేరవేశాడు. అక్కడ అతను నర్మద, రఘువీర్ మహారాజు, బాబాజీ మొదలైనవాళ్ళను ఆనంద వాతావరణంలో కలుసుకోగలిగాడు. అయితే ఇద్దరు ముసుగు వ్యక్తులు నరసింగభూపతిని తిరిగి యమదూత ద్వారానే స్వాధీనం చేసుకున్నారు. మైత్రేయి మహామాయను రాయదుర్గం నుండి విడిపించింది. ఇద్దరూ రఘువీర్ మహారాజుకు అపాయం తలపెట్టి భూగృహంలో ప్రవేశించారు. కాని వాళ్ళ ప్రయత్నం నెరవేరలేదు. తర్వాత—

# 1

ఆనందడోలికలలో ఊగులాడుతున్న భూగృహంలోని వ్యక్తులలో తిరిగి నిరాశ, నిస్పృహ ఆవరించాయి. నర్మద, కళ్యాణి, భవాని వగైరా తమ తండ్రికి సంబంధించిన విచారంలో మునిగిపోయి ఉన్నారు.

"చూస్తే ఇందులో ఏదో గూడుపుఠాణీ ఉన్నట్టనిపిస్తోంది," అన్నది నర్మద నెమ్మదిగా.

"కాని కాపలా భటులు మాత్రం ఆయన స్వయంగా ఎక్కడికో వెళ్ళినట్టు చెప్తున్నారు. దీన్ని బట్టిచూస్తే

ఆయనే స్వయంగా ఏదో రహస్యమైన పనిమీద ఎవరికీ చెప్పకుండా వెళ్ళినట్టనిపిస్తోంది,'' అంది కళ్యాణి.

''అయితే అలా వెళ్ళింది నాన్నగారి వేషంలో ఉన్న మరొక వ్యక్తి కాకూడదా ?'' అని ప్రశ్నించింది భవాని.

''అలా జరగడానికి కూడా ఆస్కారం కనిపించడంలేదు. భూగృహంలో ఇప్పుడు మనకు శత్రువులెవరూ లేరు,'' అంది కళ్యాణి.

''అయినా నాకు ఎందుచేతో యమదూత మీద అనుమానంగానే ఉంది. అతను మనకు అనేక ఉపకారాలు చేసినా అపకారాలు కూడా తలపెడుతున్నాడేమో అనిపిస్తోంది,'' అంది భవాని.

నర్మద మౌనంగా ఆలోచిస్తూ కూర్చున్నదల్లా ఒక్కసారిగా లేచింది. గదిలోంచి బయటికి నడిచి ప్రక్క గదిలోకి వెళ్ళింది.

ఆ గదిలో బాబాజీ మాలతితోపాటు కూర్చుని ఉన్నాడు. ఆయన ముఖంమీదకూడా విచారరేఖలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నర్మద తన గదిలోకి రావడం చూడగానే అతను నామెవంక ప్రశ్నార్థకంగా చూశాడు.

నర్మద దగ్గరలోనే ఉన్న ఒక ఆసనంమీద కూర్చుని నెమ్మదిగా అంది.

''నాన్నగారు కనిపించకుండాపోయిన విషయం మాట్లాడదామని వచ్చాను. మహారాజుగారు ఎక్కడికి వెళ్ళిందీ తెలియలేదు. ఆయనతో మాట్లాడ్డానికి అవకాశం చిక్కలేదు.''

"అదే నాకూ ఏమీ తోచకుండా ఉంది. యమదూత చాలా శ్రమపడి నరసింగభూపతిగారిని విడిపించుకొని వచ్చాడు. తిరిగి అతనే ఆయనకు ఎలాంటి అపకారమైనా తలపెట్టి చూశాడనడానికి ఆస్కారం కన్పించడంలేదు. పైగా ఇప్పుడుకూడా అతను ఆయనను వెదకి పట్టుకు రావడానికే వెళ్ళాడు. ఒకవేళ నరసింగభూపతి ఏదో పనిమీద బయటికి వెళ్ళాడనుకున్నా ఎవరితోనూ చెప్పకుండా ఎందుకు వెడతాడు?" అన్నాడు బాబాజీ.

"నేనుకూడా ఆయనను వెదకడానికి వెళ్దామనుకుంటున్నాను. మళ్ళీ ఆయన ఏ శత్రువుల చేతిలోనైనా చిక్కారేమోనని భయంగా ఉంది. యమదూత కోసం వచ్చారని కాపలా భటులు చెప్పిన ఆ ఇద్దరు ముసుగు వ్యక్తులెవరో?" అంది అనుమానంగా నర్మద.

"అదొకటి అనుమానించవలసిన విషయమే. వాళ్లు రావటం, నరసింగభూపతి పోవటం నాలోకూడా అనుమానాన్ని రేపుతున్నాయి. పైగా యమదూత ఏదో నెపంతో వెంటనే రఘువీర్ మహారాజుగారి అనుజ్ఞ పొంది ఇక్కడి నుంచి వెళ్ళిపోడం కూడా అనుమానాస్పదమే," బాబాజీ అన్నాడు.

"అందుకే ఈ విషయంలో నేను ఐక్యం కలిగించుకోవాలనుకుంటున్నాను. యమదూత ఈపాటికి ఎక్కువ దూరం వెళ్లి ఉండడు. ఎలాగో ఒకలా అతని దగ్గరినుండి మాయోపాయంతో కొన్ని రహస్యాలు బయటికి లాగవచ్చు," అంది నర్మద.

ఇంతలో బయటినుంచి అడుగుల చప్పుడు వినిపించింది. అందరి చూపులూ ద్వారంవైపు తిరిగాయి. వెంటనే అందరూ ఆనందాశ్చర్యాలతో పొంగిపోయారు.

నరసింగభూపతి నెమ్మదిగా గదిలో ప్రవేశించాడు. అతనిని కూర్చోమనికూడా ఆ ఆశ్చర్యంలో ఎవరూ అనలేకపోయారు. తనవంక చూస్తూ ఆశ్చర్యపోతున్న ముగ్గురినీ చూసి నరసింగభూపతి నవ్వాడు.

"ఏమిటలా చూస్తున్నారు. నేను వింతగా కనిపిస్తున్నానా ?"

ఆశ్చర్యంలోంచి తేరుకున్న బాబాజీ కూడా చిరునవ్వు నవ్వుతూ అన్నాడు.

"మీకోసం మేం దిగులు పడిపోతున్నాం. ఎవరికీ నూ చెప్పకుండా ఎక్కడికో వెళ్ళిపోతే ఏమనుకోవాలి. మా మనస్సుల్లో రకరకాల ఆలోచనలు చెలరేగుతున్నాయి."

"ఏమనుకుంటున్నారు మీరు ?" కుతూహలంగా అడిగాడు నరసింగభూపతి.

"మళ్ళీ ఎవరైనా మిమ్మల్ని అపహరించారేమోనని మా భయం," బాబాజీ నవ్వుతూ అన్నాడు.

"అలాంటిదేమీ జరగలేదు."

"అలా జరగకపోయినా మా అనుమానాలు మాకుంటాయిగా. నర్మద మిమ్మల్ని వెదకి పట్టుకోడానికి బయలు దేర బోతూంది కూడా."

నరసింగభూపతి నర్మదవైపు తన చూపులు ఆనందంగా పోనిచ్చాడు.

"అంత కంగారు పడిపోవడానికి నేనేమీ చిన్నవాడిని కాదుగా," అన్నాడు నరసింగభూపతి.

"కాకపోయినా ఇప్పటి పరిస్థితుల్లో ప్రతిదానిని అనుమాన దృష్టితో చూడాల్సి వస్తోంది," నర్మద అంది.

"ఇంతకూ ఈ సందర్భంలో మీ కెవరిమీద అనుమానం కలిగింది ?"

"మరెవరున్నారు ? యమదూత మీదికే అందరి అనుమానపు చూపులూ పోయాయి."

"పాపం అతనీ విషయంలో అమాయకుడు. నన్ను విడిపించి ఎంతో సాయంచేసిన వ్యక్తిని మీ రనుమానించారన్న మాట."

"అంతకంటే అనుమానించదగిన వ్యక్తులు మరెవరూ లేరు కనుక అతనినే అనుమానించవలసి వచ్చింది. పైగా ఆ రాత్రి అతనికోసం ఇద్దరు ముసుగు వ్యక్తు లెవరో వచ్చినట్టు భటుల ద్వారా తెలియడంతో మా అనుమానం మరింత బలపడింది."

కాసేపాగదిలో నిశ్శబ్దం ఆవరించింది. తర్వాత నరసింగ భూపతి అన్నాడు.

"రఘువీర్ గదిలో లేడు. ఎవరో ఒక వ్యక్తి అతని గదిలో కూర్చుని ఉన్నాడు. అత నెవరో నాకు తెలియ లేదు."

"ఆ వ్యక్తి మహారాజుగారితో మాట్లాడడానికి వచ్చాడు. ఏం జరిగిందో ఏమిటో తెలియలేదు. మహారాజుగారు

ఎక్కడికో వెళ్ళారు. ఇంకా తిరిగిరాలేదు," బాబాజీ అన్నాడు.

"నాకోసం వెదుకుతూ వెళ్లలేదు కదా!"

"ఏమో!"

"ఇంతకూ మీరెక్కడికి వెళ్ళి వచ్చిందీ చెప్పనేలేదు," మాలతి అడిగింది.

"అదొక విచిత్ర సంఘటన," అన్నాడు నరసింగ భూపతి.

"అదేమిటో తెలుసుకోవాలని నాకూ కుతూహలంగా ఉంది." బాబాజీ అడిగాడు.

నరసింగభూపతి నెమ్మదిగా చెప్పనారంభించాడు.

"గదిలో నేను నిద్రపోతున్నాను. ఇంతలో ఏదో పెద్ద చప్పుడైంది. నేను మంచంమీద లేచి కూర్చున్నాను. నా ప్రక్కనే ఉన్న మంచంమీద యమదూతకూడా పడుకున్నట్టు గుర్తు. ఆ ప్రక్కకు చూశాను. కాని అతను కనిపించలేదు. మంచం ఖాళీగా ఉంది. నేనూ లేచి గది లోంచి బయటికి నడిచాను. అయితే చప్పుడు ఎక్కడినించి వచ్చిందీ మాత్రం తెలియలేదు. అటూ ఇటూ చూస్తూ నేను కాసేపు బయట నిలబడ్డాను. ఇంతలో ఒక ముసుగు వ్యక్తి వచ్చినా ఎదట నిలబడ్డాడు.

"యమదూత సారంగం బయట ఉన్నాడు. ఆయన మిమ్మల్ని త్వరగా పిల్చుకురమ్మన్నారు," అన్నాడా వ్యక్తి.

"ఏదో అవసరమైన పని ఉండి ఉంటుందని నేనతని వెనుక బయలుదేరడానికి నిశ్చయించుకున్నాను. 'వెళ్దాం పద,' అన్నాను.

"అతను వెంటనే మళ్లీ అన్నాడు. 'నాకు బాబాజీతో మాట్లాడాల్సిన పని ఉంది. మీరు ఒక్కరే వెళ్లండి. అక్కడ యమదూత కనిపిస్తాడు.'

"నేను సారంగ మార్గాన బయలుదేరి వెళ్ళాను. సారంగంలోంచి బయటికి వెళ్లగానే చీకటిలో యమదూతకోసం వెదికాను. కాని అతను నాకు కనిపించలేదు.

"దృఢంగా ఉన్న ఒక ఆకారం నా దగ్గరకు వచ్చింది. అతని ముఖంమీద ముసుగు ఉంది. అతను తన కుడిచేత్తో నా నోటిని నొక్కి పట్టాడు. ఎడమ చేతిలోఉన్న ఏదో వస్తువును నా ముక్కు దగ్గరకు పోనిచ్చాడు.

"అంతే. నాకు స్పృహతప్పిపోయింది. మళ్లీ నాకు స్పృహవచ్చేసరికి నే నొక గుహాలో ఉన్నాను. నా కెదురుగా ఇద్దరు ముసుగు వ్యక్తులు ఉన్న తాసనాలమీద కూర్చుని ఉన్నారు. అందులో ఒకతను ఆసనంమీదినించి దిగి నా దగ్గరకు వచ్చాడు.

"మీకు మేం శత్రువులంకాము. ఆ విషయంలో మీరు మమ్మల్ని అనుమానించకండి. ఇప్పుడు మేం చేసిన పని మీ మేలుకోసమే చేశాం," అతనన్నాడు.

"ఆ మాటలు విన్న నాకు ఆశ్చర్యం కలిగింది. నాకు మేలు చెయ్యడంకోసం నన్ను బంధించి తీసుకువెళ్ళిన ఆ వ్యక్తులెవరో మాత్రం నాకెంతకూ తెలియలేదు. చివరికి

వాళ్లు నన్ను ఒకే ఒకటి కోరారు. ఈ సంఘటన విషయం బాబాజీతో చెప్పి ఆయనకు ఒక ఉత్తరం ఇమ్మన్నారు. నేనందుకు సమ్మతించాను. వాళ్లు వెంటనే ఒక ఉత్తరం రాసి నా చేతికిచ్చారు. తర్వాత మళ్లీ నేను స్పృహ కోల్పోయేట్టు చేసి భూగృహపు సొరంగం దగ్గరకు తీసుకు వచ్చారు. నాకు స్పృహ తెప్పించి వాళ్ళు వెళ్ళిపోయారు. నేనిక్కడికి వచ్చేశాను."

"ఏదీ ఆ ఉత్తరం," ఆతురతగా అడిగాడు బాబాజీ.

నరసింగభూపతి తన జేబులోంచి ఒక ఉత్తరాన్ని తీసి బాబాజీ కందించాడు. బాబాజీ మడతలు విప్పి ఆ ఉత్తరం చదవ నారంభించాడు. చదువుతున్న కొద్దీ అతని ముఖం లోంచి ఆనందాశ్చర్యాలు వ్యక్తం కాసాగినాయి

ఉత్తరం పూర్తిగా చదివింతర్వాత బాబాజీ దానిని మడచి తన దుస్తుల్లో దాచాడు. "కొంచెం పనుంది. ఇప్పుడే వస్తా," అంటూ ఆ గదిలోంచి గబగబా బయటికి నడిచాడు.

నర్మద, నరసింగభూపతి, మాలతి అకస్మాత్తుగా వెళ్ళి పోతున్న ఆయన వంక ఆశ్చర్యంగా చూస్తూ కూర్చుండి పోయారు.

## 2

గదిలో గంభీరంగా వ్యాపించిఉన్న నిశ్శబ్దాన్ని చీలుస్తూ రఘువీర్ మహారాజు బిగ్గరగా అన్నాడు.

"ఇదే నీ ఆఖరి ప్రయత్నం. అదికూడా వ్యర్థమై పోయింది. ఇక నువ్వు చెయ్యగలిగిందేమీ లేదు. ప్రపంచంలో

ఎవరికీ తెలియని రహస్య స్థలంలో నిన్ను బంధించివేస్తాను. మహారాణిగా సామ్రాజ్యాల నేలదల్చుకున్న నిన్ను కూటికి గతిలేని దానినిగా చేస్తాను."

ఈ మాటలంటున్న మహారాజు కళ్లు జేవురించి ఉన్నాయి. ఆ కళ్లలోంచి అగ్నికణాలు రాలుతున్నాయా అనిపిస్తోంది. అతని ఈ రౌద్రాకారాన్ని ఇంతకు ముందెవ్వరూ చూసి ఉండరు.

అతని ఆ ఆకారాన్ని చూసి మహామాయ భయపడి పోయింది. తాను చేసిన పాపాలకు ఫలితాన్ని అనుభవించాల్సిన సమయం దాపురించినట్టుగా ఆమె కనిపించింది. మహారాజువంక చూడలేక తన చూపుల్ని మైత్రేయి మీదికి, కపాలిమీదికి పోనిచ్చింది. ఏంచేయడానికి పాలుపోడంలేదు-

రఘువీర్ మహారాజు రెండడుగులు ముందుకు వేశాడు. నేలమీద స్పృహ తప్పి పడిపోయి ఉన్న తన వేషంలోని వ్యక్తి వంక చూశాడు. మరుక్షణంలో నేలమీదికి వంగి ఆ వ్యక్తికి స్పృహ తెప్పించాడు. కళ్లు తెరవగానే తన కెదురుగా కన్పించిన రఘువీర్ మహారాజు వంక చూసి ఆ వ్యక్తి మందహాసం చేశాడు.

"వీళ్లు ముగ్గురూ నువ్వే మహారాజువని అనుకొన్నారు. స్పృహ కోల్పోయేట్టుచేసి చంపడానికి ప్రయత్నించారు. నువ్వు అసలు మహారాజువు కాదని తెలిస్తే నీ జోలికే వచ్చేవారు కాదసలు. నాకీ విషయాలన్నీ ముందుగానే తెలుసు. అందుకే ఈ పన్నాగం పన్నాను," రఘువీర్ మహారాజు అన్నాడు.

ఆ వ్యక్తి సమాధానం ఇవ్వకుండా మహామాయ వంక విచిత్రంగా చూస్తూ నిలబడిపోయాడు. మహామాయగాని తదితరులుగాని ఉన్న చోటినుండి కదలడానికి సాహసించలేక పోయారు.

రఘువీర్ మహారాజు ఆ వ్యక్తి వంక చూసి చిరునవ్వు నవ్వుతూ ఏదో సంజ్ఞ చేశాడు. మరుక్షణంలో తాను వచ్చిన తలుపుగుండా వెనక్కి వెళ్ళాడు. ఆ వ్యక్తి కూడ వెనక్కి తిరిగి గదిలోంచి బయటికి నడిచాడు. ఒక్కసారిగా ఆ రెండు తలుపులూ మూసుకుపోయాయి. గదిలో ఉన్న మహామాయ, మైత్రేయి, కపాలి కంగారుగా నాలుగు ప్రక్కలకు తమ చూపుల్ని పోనిచ్చారు. తర్వాత ఒకరి మొఖాలు ఒకరు చూసుకొంటూ మౌనంగా నిలబడిపోయారు.

కాసేపటికి మహామాయ సంభ్రమాశ్చర్యాలలోంచి తేరుకుంది. తనకు దగ్గరగా ఉన్న తలుపువైపుకు వెళ్ళి దాన్ని తెరవడానికి ప్రయత్నించింది. కాని ఆమె ప్రయత్నం ఫలించలేదు. కంగారుగా మైత్రేయి వంక చూసింది. మైత్రేయి రెండో ప్రక్కనున్న తలుపుల్ని పరీక్షించింది. కాని ఆ తలుపులుకూడా బంధింపబడి ఉన్నాయి.

తాము బయటికి పోవడానికి మార్గం లేకపోవడంతో ముగ్గురూ భయపడిపోయారు. అయినా ఈ పరిస్థితిలో తాము చేయగలిగిందేమీ లేదు. నిరాశతో ముగ్గురూ నేలమీద కూర్చుండిపోయారు.

ఆ గదిలోంచి బయటికి నడిచిన రఘువీర్ మహారాజు చిన్నగా తన గదిలోకి వచ్చాడు. తన గదిలో ఇంకా తనకు

మహామాయ విషయం చెప్పిన వ్యక్తి కూర్చుని ఉండటం చూశాడు. చిరునవ్వు నవ్వుతూ తన ఆసనం మీద కూర్చున్నాడు.

"ఎక్కడికి వెళ్లారు మీరు?" ఆ వ్యక్తి అడిగాడు.

"మహామాయను ఖైదు చెయ్యడానికి."

"వెళ్ళిన పని సులభంగానే జరిగిందనుకుంటాను," ఆ వ్యక్తి అన్నాడు.

"వాళ్ళను బంధించడం అంత తేలిక పని కాదు. అందుకో పన్నాగం పన్నవలసి వచ్చింది. తద్వారా వాళ్ళు నా చేతికి చిక్కారు. మహామాయ, మైత్రేయి కాకుండా పారిపోవడానికి సిద్ధంగా ఉన్న కపాలి కూడా నాకు వశపడి పోయారు. అందర్నీ ఒకే గదిలోకి పంపించి నేను తిరిగి వచ్చాను. ఆ గది తలుపులు తెరవడం ఎవరికీ సాధ్యం కాదు." అన్నాడు రఘువీర్ మహారాజు.

కాసేపు ఆ గదిలో నిశ్శబ్దం ఆవరించింది. తిరిగి మహారాజు అన్నాడు.

"ఇక్కడ నువ్వు మారువేషంలో ఉండవలసిన అవసరం లేదనుకుంటాను. నర్మద వగైరాలందరూ ఇక్కడే ఉన్నారు. వాళ్లతో కూడా అవసరమైన విషయాలుంటే మాట్లాడవచ్చు."

"నేనొక ముఖ్యమైన పనిమీద తిరుగుతూ మారువేషంలో ఈ ప్రాంతాలకు వచ్చాను. ఒక వ్యక్తిని గురించి వివరాలు తెలుసుకోవడం నా పని. ఆ వివరాలు తెలుసుకునే

వరకు నేనీవేషంలో ఉండడమే మంచిదనుకుంటాను," ఆ వ్యక్తి అన్నాడు.

"ఎవరా వ్యక్తి?" మహారాజు ప్రశ్నించాడు.

"మీరూ ఆ వ్యక్తిని చూశారు. కాని అతనెవరో మీకూ తెలియదు. అతను ఈ ప్రాంతాలకు వచ్చినట్టు తెలుసుకుని నేనూ ఇటు వచ్చాను."

"ఇంతకూ ఆ వ్యక్తి ఎవరో చెప్పనేలేదు."

"రాయదుర్గంలో యమదూతను ఖైదునుండి విడిపించి సహాయపడిన వ్యక్తి."

ఆ మాట వినగానే మహారాజు బిగ్గరగా నవ్వాడు.

"ఇంకా ఆ వ్యక్తికోసం అనవసరంగా శ్రమపడి తిరుగుతున్నావన్నమాట. అతనెవరో మాకెప్పుడో తెలిసింది."

"ఎవరతను."

"అతను నా ముఖ్యమిత్రులలో ఒకడు. పేరు బాబాజీ. నేను కబురు పంపగా అతనిక్కడికి వచ్చాడు. ఈ మధ్య ఇక్కడ కూడా కొన్ని విచిత్ర సంఘటనలు జరిగాయిలే."

"ఏమిటవి?"

రఘువీర్ మహారాజు భూగృహంలో జరిగిన సంఘటనలను వివరించి చెప్పాడా వ్యక్తికి. చివరి కిలా అన్నాడు.

"నువ్వు చేయవలసిన పని అయిపోయింది కొబట్టి ఇక వేషం మార్చుకోవచ్చు. నే నొకసారి నర్మదను కలుసుకుని సంగతి సందర్భాలు మాట్లాడివస్తాను. ఈలోగా వేషం మార్చుకో."

రఘువీర్ మహారాజు గదిలోంచి బయటికి నడిచాడు. ఆ వ్యక్తి తన మారువేషాన్ని తొలగించుకోవడంలో నిమగ్న డయ్యాడు. మహారాజు తిన్నగా బాబాజీ గదిలోకి వెళ్లాడు.

ఆయన గదిలో ప్రవేశించగానే అక్కడ కూర్చుని ఉన్న నర్మద, మాలతి లేచి నిలబడ్డారు. తలవని తలంపుగా అక్కడ నరసింగభూపతిని చూడగానే మహారాజు ఆశ్చర్యాని కంతు లేక పోయింది.

నరసింగభూపతి మౌనంగా కూర్చున్నాడు. మాట్లాడ లేదు. మహారాజుగారి కుతూహలాన్ని గమనించిన నర్మద తన తండ్రి మాయం కావడానికి సంబంధించిన విషయా లన్నీ ఆయన చెప్పిన ప్రకారం వివరించి చెప్పింది.

రఘువీర్ మహారాజు అనుమానంగా నరసింగభూపతి వంక చూశాడు. ఆయన చెప్పినట్టుగా నర్మద చెప్పిన విషయాలు ఆయనకు నమ్మదగినవిగా కనిపించలేదు.

"బాబాజీ ఎక్కడ?" మహారాజు నర్మద నడిగాడు.

"ఉత్తరం చూసిన వెంటనే ఆయన ఎక్కడికో వెళ్ళారు. ఇప్పుడే వస్తానన్నారు! మరి ఎంత సేపటిలో వస్తారో తెలియదు."

రఘువీర్ మహారాజు ఒక్క క్షణం మౌనంగా ఆలో చించాడు. తర్వాత నెమ్మదిగా అన్నాడు.

"నేపాళి ఏదో పనిమీద వచ్చాడు. నా గదిలో కూర్చుని ఉన్నాడు."

"ఏమిటా పని?" ఆతురతగా అడిగింది నర్మద.

"ఆ పని మనకు తెలిసినదే. రాయదుర్గంలో యమ దూతను కాపాడడానికి వచ్చిన బాబాజీ ఎవరో తెలుసుకో డానికి బయలుదేరి ఇక్కడికి వచ్చాడు నేపాళి. కాని అతని వల్ల మన కొక మరువరాని ఉపకారం జరిగింది."

"ఏమిటది ?"

"మహామాయ, మైత్రేయి మనచేత చిక్కారు."

"మహామాయ రాయదుర్గంలో బందీగా ఉందికదూ !"

"అదే ఆశ్చర్యకరమైన విషయం. మైత్రేయి మహా మాయను ఖైదునుండి విడిపించింది. ఇద్దరూ కలిసి నా అంతు తేల్చుకోడానికి ఇక్కడికి వచ్చారు. వాళ్ళు మారు వేషాలు వేసుకుని భూగృహంలో ప్రవేశించడం చూసిన నేపాళి వెంటనే వచ్చి ఆ సంగతులు నాకు తెలియ చేశాడు."

"తర్వాతేం జరిగింది ?" మహారాజు ఆగడం చూసి నర్మద ఆతురతగా అడిగింది.

"ఆ ఇద్దరినీ నేను కపాళితోపాటు భూగృహంలోని ఒక గదిలో బంధించాను. ఇక వాళ్లను విడిపించడం ఎవరితరమూ కాదు," మహారాజు సమాధానమిచ్చాడు.

రఘువీర్ మహారాజు వెనక్కి తిరిగాడు. నర్మద ఆయన ననుసరించింది. ఇంతలో బాబాజీ గబగబా వస్తూ కనిపిం చాడు వాళ్లకు.

"అత్యవసరమైన పనిమీద బయటికి వెళ్ళాను," అన్నాడు బాబాజీ మహారాజును చూడగానే.

రఘువీర్ మహారాజు మందహాసంచేస్తూ అన్నాడు.

"నా గదిలోకి వెళ్దాంపదండి. అక్కడ కొన్ని విష యాలు మాట్లాడుకోవాల్సిన పని ఉంది."

ముగ్గురూ గదిలో ప్రవేశించేసరికి నేపాళి తన మారు వేషాన్ని మార్చుకున్నాడు. బాబాజీ వంక ఆశ్చర్యంగా చూశాడు. తను ఇంతకాలంగా ప్రయత్నంచేసిన వ్యక్తి వివరాలు సునాయాసంగా ఈనాడు తెలుసుకోగలిగాడు.

గదిలో అందరూ ఉచితాసనాలమీద కూర్చున్న అనంతరం మహారాజు అన్నాడు.

"యమదూత పాపం నరసింగభూపతిగారిని వెదకుతూ బయలుదేరాడు. అతనికాయన విషయం తెలియచేసి ఇక్కడికి రప్పించడం అవసరం."

"ఔను. లేకపోతే లేనిపోని ప్రయత్నాలుచేస్తూ అతను చాలా చిక్కుల్లో ఇరుక్కోవలసి రావచ్చు," బాబాజీ అన్నాడు.

"నే నెలాగో రాయదుర్గం వెళ్తానుగా. దారిలో అతను కనిపిస్తే విశేషాలు చెబుతాను. ఏంచెప్పమంటారు?" అన్నాడు నేపాళి.

రఘువీర్ మహారాజు నరసింగభూపతి తిరిగివచ్చిన సంగతి నేపాళికి తెలియచేశాడు.

"ఈ విషయమే అతనికి చెప్పాలి. అయితే ఎవరినైనా భటుడిని అతని దగ్గరకు పంపడం మంచిది. నువ్వు రాయ దుర్గం వెళ్ళి మహామాయ మాచేత చిక్కిన విషయం అక్కడి వాళ్ళకు త్వరలో తెలియచెయ్యడం అవసరం. మహామాయ

తప్పించుకుపోయినందుకు వాళ్లు విచారపడుతూ ఉండి ఉంటారు," అన్నాడు రఘువీర్ మహారాజు

నేపాళి మాట్లాడలేదు. కాసేపాగదిలో నిశ్శబ్దం ఆవరించింది. ఆ నిశ్శబ్దానికి భంగం కలిగిస్తూ నర్మద అంది.

"రఘువీర్ మహారాజుగారిని బంధించి, ఆయన చనిపోయినట్టు వదంతి లేవదీసి మహామాయ రాజ్యాన్నేలింది. ఇప్పుడు మహారాజుగారు క్షేమంగా ఉన్నట్టు ప్రజలకి తెలిసింది. మహామాయ అసలు రాణి కాదన్న విషయంకూడా అందరికీ తెలిసింది. ఈ సందర్భంలో రాజ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ప్రజలకు తదితర రాజ్యాలవారికి తెలియడానికి రఘువీర్ మహారాజుగారు మళ్ళీ పట్టాభిషేకోత్సవం జరుపుకోవడం అవసరమని భావిస్తున్నాను."

బాబాజీ చిరునవ్వు నవ్వుతూ అన్నాడు. "నేనూ ఈ విషయం మహారాజుగారికి చెప్పాలనుకుంటున్నాను. ఇంతలో నర్మద చెప్పేసింది."

"వెనుక ఓసారి ఈ ప్రసక్తి వచ్చినప్పుడు శత్రువుల నందరినీ చేజిక్కించుకున్న తర్వాతకాని తాను బయట పడరాదన్న అభిప్రాయాన్ని మహారాజుగారు తెలియచేశారు. కాని ఇప్పుడా అడ్డుకూడా లేదు. శత్రువులందరూ చేజిక్కారు. ఇప్పుడు మన నెదిరించగలవాళ్ళెవరూ లేరు కూడా," అంది నర్మద.

"రఘువీర్ మహారాజుగారు ఇందు కంగీకరిస్తారనుకుంటాను," నేపాళి అన్నాడు తన అభీష్టాన్నికూడా తెలియ చేస్తూ.

రఘువీర్ మహారాజు కాసేపాలోచించాడు. తర్వాత నెమ్మదిగా అన్నాడు.

"ఇందు కెలాంటి అభ్యంతరమూ నాకులేదు. కష్టపు రోజులు గడిచిపోయాయి కనుక, ఇక ప్రజల ముందు వారి ఇష్ట ప్రకారం రాజ్యం స్వీకరించడం మంచిపనే అవుతుంది. అయితే ఒకే ఒక విషయం—"

రఘువీర్ మహారాజు బాబాజీ వంక చూస్తూ అన్నాడు.

'మంచివాడనుకున్న సాధు మంత్రి పదవిలో ఉండి నన్ను మోసగించాడు. ఇప్పుడతను ఎలాగో తొలగిపోయాడు కాబట్టి నాకు సహచరులుగా మంత్రిగా ఉండవలసిందిగా మిమ్మల్ని కోరుతున్నాను."

బాబాజీ రఘువీర్ మహారాజువంక తన చూపును పోనిచ్చి మంద్రస్వరంలో అన్నాడు.

"ఇంతవరకు నేనెక్కడా మంత్రిత్వం వహించలేదు. కొందరు మహారాజుల వద్ద గూఢచారి దళాధిపతిగా ఉండి వయస్సుతోపాటు విరమించుకున్నాను. ఇప్పుడు విశ్రాంతి తీసుకోవాలని అనుకుంటున్నాను. నా కుమార్తె క్షేమంగా నాకు లభించింది. ఆమెతో కాలం వెళ్ళబుచ్చుతూ ఎక్కడో ఒకచోట పడి ఉంటాను. మళ్ళీ నన్ను రాజ్యాంగ విషయాల్లోకి దించవద్దు."

"నేనూ ఇంతవరకు అనేక కష్టాలనుభవించాను. ఈ సమయంలో మీలాంటి వాళ్ళ అండ నాకు కావాలి. లేకపోతే నేను రాజ్యపాలన చేయడం సులభం కాదేమో," అన్నాడు రఘువీర్ మహారాజు.

"మహారాజుగారి కోర్కెను మీరు తిరస్కరించడం భావ్యం కాదేమో," అన్నది నర్మద బాబాజీ వంక చూస్తూ.

బాబాజీ కాసేపు మౌనం వహించాడు. తర్వాత ఓసారి గదిలో ఉన్న అందరిమీదికీ తన చూపుల్ని పోనిచ్చి ఇలా అన్నాడు.

"సరే. మీ ఇష్టప్రకారం మళ్ళీ గురుతరమైన బాధ్యతను వహించడానికి సిద్ధంగా ఉన్నాను."

రఘువీర్ మహారాజు ఆనందంగా బాబాజీ వంక చూసి అన్నాడు.

"ఇక మనం పట్టాభిషేకానికి ఏర్పాటులు చేసుకోవచ్చు. ఈ సందర్భంగా అనేకమంది అతిథులను మనం పిలవాలి. నరేంద్రమహారాజు, ప్రతాప్, జయంత్‌లు ముఖ్యులు."

"ఈ ఏర్పాట్లన్నీ నేను చేయిస్తాను. పైవారికి అందరికీ ఈ రోజే ఆహ్వానాలు పంపిస్తాను," బాబాజీ అన్నాడు.

ఈ సందర్భంలో మనకు లభించిన ఖైదీలను ఇక్కడికి రప్పించి నరేంద్ర మహారాజాగుల ఎదుట విచారించటం మంచిదిగా భావిస్తున్నాను," అన్నది నర్మద.

"మన ఖైదీలు బయట మాత్రం ఎవరున్నారు? రాయదుర్గంలో సాధు, బాబాజీ భవనంలో బికారి ఉన్నట్టున్నారు," అన్నాడు మహారాజు.

"వాళ్ళిద్దర్నీ ఇక్కడికి రప్పించే ఏర్పాట్లు నేను చేయిస్తాను," అన్నాడు బాబాజీ.

"మరి మంథర విషయం?" అని ప్రశ్నించింది నర్మద.

"అవును. ఆమె నరేంద్ర మహారాజు కోటలో ఉన్న ట్లుంది." అన్నాడు మహారాజు.

"మన ఖైదీలు ఎక్కడెక్కడున్నారో ఆలోచించి వాళ్లను పంపించవలసిందిగా ఆయా దుర్గాధిపతులకు నేను వినతి పత్రాలు పంపుతాను." అన్నాడు బాబాజీ.

గదిలో నిశ్శబ్దం ఆవరించింది. ముఖ్యంగా మాట్లాడు కోవాల్సిన విషయాలు ముగిశాయి. నర్మద సంతోషకరమైన ఈ విషయాలను మిగిలిన స్త్రీలకు అందజేయడానికి వెళ్ళి పోయింది. రఘువీర్ మహారాజు ఏదో ఆలోచిస్తూ మౌనంగా కూర్చున్నాడు.

## 3

పడమటి కొండలు బారులు తీర్చి నిల్చి ఉన్నాయి. వాటిని ఆవరించి ఉన్న లోయలలో దట్టంగా పెరిగిన పచ్చటి చెట్లు కళ్లకు ఆహ్లాదాన్ని కల్గిస్తున్నాయి. ఆ పరిసరాలలోని ప్రకృతి దృశ్యాలు ఎటువంటవారి మన్నలనైనా చూర గొంటాయి. చంద్రుని వెన్నెలలో ఆ ప్రాంతమంతా దేవ లోకంలా కనిపిస్తోంది.

ఇద్దరు ముసుగు వ్యక్తులు కొండల అంచున నడుస్తూ ప్రయాణం చేస్తున్నారు. అందులో ఎవరూ ఏమీ మాట్లాడ డంలేదు. నిశ్శబ్దం అన్ని ప్రక్కలా రాజ్యం చేస్తోంది. ఆ నిశ్శబ్ద వాతావరణంలో వాళ్లిద్దరూ అలా చాలా దూరం నడిచారు.

ఇద్దరూ ఒకచోట ఆగిపోయారు. వాళ్ళ కెదురుగా మూడు పెద్ద పెద్ద చెట్లు నిల్చి ఉన్నాయి. ఒక్క నిమిషం నాలుగువైపులా పరిశీలించి చూసి ఆ ఇద్దరూ చెట్ల వెనుకకు వెళ్ళారు. చెట్ల వెనుకగా ముందుకేమాత్రం కన్పించకుండా దాగి ఉన్న కొండ, దానికొక చిన్న గుహ ఉన్నాయి. ఆ ఇద్దరూ ఆ చిన్న గుహలో ప్రవేశించారు. లోపల అంధకారం ఆవరించి ఉంది.

అందులో ఒకతను తన దగ్గిర ఉన్న కొవ్వొత్తిని తీసి వెలిగించాడు. కొద్ది దూరం నడిచేసరికి ఆ గుహ అంతం కావడం అక్కడినుంచీ ముందుకు సాగిపోతున్న సొరంగ మార్గాన వాళ్లు నడిచిపోడం మామూలుగా జరిగిపోయాయి.

ఆ సొరంగం చివరఉన్న కొయ్య తలుపును తెరచుకొని ఇద్దరూ సొరంగంలోంచి బయటికి నడిచారు. విశాలమైన మైదానంలో ప్రవేశించగానే కొవ్వొత్తిని ఆర్పివేసి ఇద్దరూ ముందుకు సాగారు.

నాలుగువైపులా కొండలతో ఆవరించబడిఉన్న ఆ మైదానంలో అక్కడక్కడా చిన్న చిన్న ఇళ్లు, భవనాలు ఉన్నాయి. మొత్తానికి ఎక్కువగా చెట్లతో ఆవరించబడి ఉన్న ఆ మైదానం రమణీయంగా ఉంది.

మైదానం మధ్యగాఉన్న ప్రధాన భవనం వైపు ఇద్దరూ ప్రయాణం సాగించారు. భవనాన్ని సమీపించగానే ముఖ ద్వారం వద్ద కాపలాఉన్న భటులు తలలు వంచి వాళ్లకు అభివాదనాలు చేశారు.

ఇష్టంగా మౌనంగా భవనం లోపలికి ప్రవేశించారు. కొంచెం దూరం నడిచి ఒక గదివద్దకు చేరుకున్నారు. ఒక్క క్షణం గదిముందు నిలబడి తర్వాత నెమ్మదిగా లోపలికి ప్రవేశించారు.

గదిలో ఒక ప్రక్కగా పెద్ద దీపం వెలుగుతోంది. కిశోర్ తన ఆసనంమీద కూర్చుని ఏవో విషయాలు దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. తండ్రి సంహరింపబడినప్పటినుండి అతనికి మాత్రం విశ్రాంతి లేకుండా ఉంది.

తాము కోల్పోయిన రాజ్యాన్ని తిరిగి ఎలా స్వాధీనం చేసుకోడమా అని అతననేక విధాల ఆలోచించాడు. అయినా ఏం చేయాలో అతనికి తోచలేదు. నరేంద్ర మహారాజును ఆశ్రయించి తిరిగి రాజ్యాన్ని సంపాదించుకో వచ్చు. కాని అదే మాత్రం అతని కిష్టంలేదు. మరొక పద్ధతి ఆయన శత్రువులతో చేయి కలిపి ఎలాగైనా రాజ్యాన్ని సంపాదించడానికి ప్రయత్నించడం. అయితే ఇది కూడా ఆచరణయోగ్యంగా కన్పించలేదు.

ఇక మిగిలింది ఒకే పద్ధతి స్వయంగా తన సైన్యంతో రాయదుర్గంమీదికి దండెత్తి వెళ్ళి దానిని జయించడం. అదెంతవరకు సాధ్యం కాగలదో చూసిరమ్మని సైన్యాధిపతి మార్తాండుడిని పంపాడు కిశోర్.

ముసుగువ్యక్తు లిద్దరూ గదిలో ప్రవేశించారు. కిశోర్ వాళ్ళ వంక చూసి మందహాసం చేశాడు. ఇద్దరూ కిశోర్‌కు ఎదురుగా ఉన్న ఉచితాసనాలమీద కూర్చుని ముసుగులు తొలగించారు.

మార్తాండుడి వంక, అతని అనుచరుని వంక చూస్తూ కిశోర్ ప్రశ్నించాడు.

"వెళ్ళిన పని ఏమయింది?"

"అదొక ఘనకార్యం కాదుగా, అంతుపంతులు తేల్చుకురావడానికి. రాయదుర్గంలో రహస్యంగా ప్రవేశించి అక్కడి విశేషాలు తెలుసుకు వచ్చాం." మార్తాండుడన్నాడు.

"ఆ విశేషాలేమిటో చెప్పమనే నేనడుగుతున్నాను." కిశోర్ మందహాసం చేస్తూ అన్నాడు.

"రాయదుర్గాధిపతిగా ఇప్పుడు జయంత్ నియమించబడ్డాడు. కోట, రాజ్యం అతని అధీనంలోనే ఉన్నాయి. వాళ్ల గూఢచారి దళాధిపతి మంత్రవాది కోటలోనే ఉన్నట్టుగా తెలిసింది——"

అతను పూర్తి చెయ్యకముందే మధ్యలో కిశోర్ అన్నాడు.

"మంత్రవాది అక్కడ ఉండడం ఎలాగైనా మనకు అపాయకరమే."

మార్తాండుడు నవ్వుతూ అన్నాడు.

"అతనికే మీరు భయపడిపోతున్నారన్నమాట. ఒక సామాన్య గూఢచారి మనల్ని చెయ్యగలిగిందేముంది? వాళ్ల సైన్యాధిపతి విక్రమ్ కూడా అక్కడలేడు. జయంత్ వచ్చిన కొద్ది రోజులికి అతను తమ కోటకు వెళ్ళిపోయాడు."

"ఇప్పుడు రాయదుర్గంలోని వాళ్ళ సైన్య బలం ఎంత?"

"అది అంత ఎక్కువగా ఉన్నట్టు కనిపించదు. వేల సంఖ్యలోకూడా సైనికులు లేరేమోనని నా అనుమానం."

"సైన్యాధిపతి ఎవరో తెలుసుకున్నారా?"

"సైన్యం ఎంత ఉంది కొబట్టి—సైన్యాధిపతి అవసరం రావడానికి. జయంత్ తప్ప అక్కడ బలవంతులైన వ్యక్తులు వేరే ఎవరూ లేరు."

"ఐనా మంత్రవాది ఉన్నాడంటే నాకు కొంత జంకుగానే ఉంది." కిశోర్ తన తుది అభిప్రాయాన్ని తెలిపాడు.

మార్తాండుడు పుల్లీ నవ్వాడు.

"మీ రతనిని గురించి భయపడకండి. అతనినెలాగైనా సరే మాయోపాయంతో బంధించే బాధ్యతను నేను అగ్నివర్మ కప్పగిస్తాను. ఇకపోతే మనం రహస్యంగా చిత్రగృహంలో ససైన్యంగా ప్రవేశించే మార్గాన్ని గురించి ఆలోచించాలి."

"ఆ మార్గం నాకు తెలుసు. నాన్నగారు చెప్పగా విన్నాను. సైన్యాన్ని తీసుకుని మనం తిన్నగా ఆ మార్గంగుండా చిత్రగృహంలోకి ప్రవేశించవచ్చు," కిశోర్ అన్నాడు.

"అయితే సైన్యాన్ని సిద్ధం చెయ్యమంటారా?" మార్తాండుడు ప్రశ్నించాడు.

"ఒకసారి నరేంద్ర మహారాజు కోటకు వెళ్ళి అక్కడి పరిస్థితులు కూడా చూసివస్తే మనకు మరింత ప్రోత్సాహకరమైన పరిస్థితి ఎదురుకావచ్చు," కిశోర్ అన్నాడు.

"అవన్నీ అనవసరమని నా ఉద్దేశం. మనం రాయదుర్గం మీద దండెత్తబోతున్నాం కాని నరేంద్ర మహారాజు కోట మీద కాదుగా," మార్తాండుడన్నాడు.

"అయితే మీ ఇష్టం. సర్వసన్నాహాలు చేయించండి. కార్యభారమంతా మీమీద, అగ్నివర్మమీద విడిచి వేస్తున్నాను. ఇదే మన తుదిప్రయత్నం. ఈసారి విజయమో, వీరస్వర్గమో—అంతే," కిశోర్ దృఢనిశ్చయంతో అన్నాడు.

మార్తాండుడు ఆనందంగా నవ్వుతూ గదిలోంచి బయటికి నడిచాడు. అతని వెనుక అనుచరుడుకూడా వెళ్ళిపోయాడు. గదిలో తిరిగి నిశ్శబ్దం ఆవరించింది. మూలగా వెలుగుతున్న పెద్ద దీపపు కాంతిలో కిశోర్ తన ఆసనంలో వెనక్కి వ్రాలి ఏదో దీరాలోచనలో మునిగిపోయాడు.

## 4

పిచ్చివాడిలా కనిపిస్తున్న ఒక వ్యక్తి అడవిలో చెట్ల మధ్యగా పరుగెడుతున్నాడు. చూడడానికి లావుగా బలంగానే ఉన్నా ఆకారాన్ని బట్టి అతను పిచ్చివాడని గ్రహించడం సులభం.

ఆ వ్యక్తి అలా పరుగుతీస్తూ అకస్మాత్తుగా ఒకచోట ఆగిపోయాడు. అతనికి కనుచూపు దూరంలో రెండు గుర్రాలు వేగంగా పరుగుడుతూ కనిపించాయి. వాటివంక తదేక దృష్టితో చూస్తూ అతను కాసేపక్కడే నిలబడ్డాడు.

ఆ గుర్రాలు తనవైపే వస్తున్నట్టు అతను గ్రహించాడు. ఒక చెట్టు చాటుకు తప్పుకుని వాటివంక చూస్తూ ఏదో

ఆలోచించసాగాడు. అలా ఐదు నిమిషాలు గడచి పోయాయి. గుర్రాలతనిని సమీపించాయి.

గుర్రాలమీదఉన్న వ్యక్తులిద్దరూ ముసుగులు ధరించారు. అందుచేత వాళ్లను గుర్తుపట్టడం చెట్టు చాటున ఉన్న వ్యక్తికి ఏ మాత్రం సాధ్యం కాకుండా ఉంది.

గుర్రాలు తన ముందుకు రాగానే ఆ వ్యక్తి చెట్టు చాటు నించి తప్పుకుని గుర్రాల కెదురుగా పరుగెత్తాడు. అతనిని చూడగానే ఎవరో పిచ్చివాడనుకుని ఆ ముసుగు వ్యక్తులిద్దరూ గుర్రాల్ని ప్రక్కకు త్రిప్పి వెళ్ళిపోవాలనుకున్నారు కాని వీలు కాలేదు.

పిచ్చివాడిలా ఉన్న ఆ వ్యక్తి నేర్పుగా ఒక గుర్రం కళ్లెపుతాడు గట్టిగా పట్టుకున్నాడు. అంతటితో ఆ గుర్రం ఎక్కడి దక్కడే నిలచిపోయింది. దానితోపాటు రెండవ గుర్రం కూడా ఆగిపోవలసి వచ్చింది.

"ఎవరు నువ్వు?" ముందు గుర్రంమీద ఉన్న వ్యక్తి అడిగాడు.

"అక్కడొక మనిషిని ఎవరో చంపుతున్నారు. ఆ దృశ్యం చూడలేక నేను పారిపోయి వచ్చాను. మీరు వచ్చి అతన్ని కాపాడాలి," అన్నాడు గుర్రాన్ని ఆపిన వ్యక్తి.

"ఎక్కడది?" అని అడిగాడు రెండవ గుర్రంమీదఉన్న వ్యక్తి.

"కొద్ది దూరంలోనే, ఆ కనిపించే చెట్టు వెనక," అన్నాడావ్యక్తి.

రౌతులిద్దరూ గుర్రాలమీదినుంచి దిగారు. తమ ముందు నిలబడి ఉన్న వ్యక్తికేసి ఒకసారి ఎగాదిగా చూసి 'వెళ్దాం పద' అన్నారు.

పిచ్చివాడులా ఉన్న ఆ వ్యక్తి ముందు నడవసాగాడు. అతని వెనక రౌతు లిద్దరూ వెళ్ళారు.

చెట్లు దట్టంగా క్రమ్ముకున్న మధ్యాటవిలోకి చేరుకోగానే ముందు వెళ్తున్న వ్యక్తి ఆగిపోయాడు. దగ్గరలోనే ఉన్న ఒక చెట్టు వైపుకు వేలుపెట్టి చూపించాడు. రౌతులిద్దరూ ఆ ప్రక్కకు తమ చూపులు పోనిచ్చారు.

చెట్టుకింద ఒక వ్యక్తి కిల్లకిలా పడి ఉన్నాడు. మరొక వ్యక్తి అతనిమీదికి వంగి నిలబడ్డాడు. అతని చేతిలో చిన్న కత్తి మెరుస్తోంది.

పిచ్చివాడు అక్కడే నిలబడిపోయాడు. రౌతులిద్దరూ ఆ వ్యక్తిని కాపాడ్డంకోసం ముందుకు పరుగు తీశారు. వాళ్లా చెట్టును సమీపించేసరికి కత్తి చేత పట్టుకుని నిలబడిన వ్యక్తి వాళ్లను చూసి వెనక్కి పారిపోయాడు. ఒక రౌతు అతన్ని వెంటాడడానికి ప్రయత్నించాడుగాని లాభంలేక పోపోంది. కొద్ది దూరం వెళ్లి వెనక్కి తిరిగి వచ్చాడు.

చెట్టుకింద పడిపోయి ఉన్న వ్యక్తి స్పృహ కోల్పోయి ఉన్నాడు. అతని దుస్తులమీద అక్కడక్కడా రక్తపుమరకలున్నాయి. గాయం ఎక్కడేర్పండీ మాత్రం స్పష్టంగా కనిపించడంలేదు.

రెండవ రౌతు అతన్ని భుజాన వేసుకుని దగ్గరలోనే ఉన్న చిన్న కాసారం దగ్గరికి తీసుకువెళ్దామనుకున్నాడు.

కానీ అతన్ని లేవనెత్తడం ఒక్కడికీ సాధ్యం కాలేదు.

ఇంతలో వెనక్కి తిరిగి వచ్చిన రెండవ రౌతు అతనికా విషయంలో సాయపడ్డాడు. ఒకరు తల, ఒకరు కాళ్లు పట్టుకుని ముందుకుసాగారు. దూరంగా నిలబడిఉన్న పిచ్చివాడు ఒక్కసారిగా వికటంగా నవ్వడం వాళ్ళకు వినిపించింది.

రెండడుగులు వేశారో లేదో రౌతులిద్దరూ తూలిపోసాగారు. ఏదో మత్తు వాళ్ళ శరీరాలను ఆవరించినట్లయింది. సంగతేమిటో అర్థం కాక ఇద్దరూ తమ చేతుల్లో ఉన్న వ్యక్తిని కిందకు వదిలారు. అయినా లాభం లేకపోయింది. మరుక్షణంలోనే ఇద్దరూ ఆ వ్యక్తి ప్రక్క కుప్పలా కూలిపోయారు.

ఇదంతా జరగడానికి ఎక్కువ సమయం పట్టలేదు. దూరంగా నిలబడి ఈ విచిత్రాన్నంతా చూస్తున్న పిచ్చివాడు రౌతులిద్దరూ నేల కొరిగిపోగానే అక్కడికి పరుగెత్తుకు వచ్చాడు. అదే సమయానికి కత్తి చేతపట్టుకు పారిపోయిన వ్యక్తికూడా వచ్చాడు.

పిచ్చివాడులా ఉన్న ఆ వ్యక్తి రక్తపు మరకలతో క్రింద పడిపోయిఉన్న మనిషికి స్పృహ తెప్పించాడు. స్పృహ రాగానే అతను తన దగ్గరగానే పడిఉన్న ముసుగు వ్యక్తుల్ని చూసి మందహాసం చేశాడు. వెంటనే లేచి నిలబడ్డాడు.

"పాపం వీళ్ళిద్దరూ నీ దుస్తులమీద ఉన్నది రక్తమే అని మోసపోయారు అది మొదటి రకం మత్తుమందని గ్రహించలేక పోయారు," అన్నాడు పిచ్చివాడులా ఉన్న వ్యక్తి.

ఒక్క క్షణం అక్కడ నిశ్శబ్దం ఆవరించింది. ఆటుపిమ్మట ఆ పిచ్చివాడి ఆజ్ఞ ప్రకారం ముసుగు వ్యక్తు లిద్దర్నీ మిగిలిన వ్యక్తులిద్దరూ భుజలమీదికి ఎత్తుకున్నారు.

ముగ్గురూ కాసేపట్లో ముసుగు వ్యక్తుల గుర్రాలను సమీపించారు.

"మీరు వీళ్లను తీసుకుని మన గుహ దగ్గరకు వెళ్ళండి. నేను మరొక పని చూసుకుని వెంటనే వచ్చేస్తాను. ఈ లోపల వీళ్లను జాగ్రత్తగా చూస్తూండండి," అన్నాడు యమదూత తన మారువేషాన్ని తొలగించుకుంటూ.

"పాపం వీళ్ళు నన్ను నిజంగానే పిచ్చివాడు అనుకున్నారు. యమదూత శక్తి సామర్థ్యాలను వాళ్లు గ్రహించి ఉండరు," అన్నాడు తిరిగి తన అనుచరులు గుర్రాలమీదికి ఎక్కుతూండగా.

యమదూత అక్కడే నిలబడ్డాడు. స్పృహకోల్పోయి ఉన్న ఇద్దరు ముసుగు వ్యక్తుల్నీ భుజాన వేసుకుని అతని అనుచరులు తమ గుహవైపు సాగిపోయారు.

మరుక్షణంలో యమదూత కూడా అక్కడినించి బయలుదేరాడు. అతని మనస్సులో రకరకాల ఆలోచనలు మెదలుతున్నాయి. తాను మోసగించి స్వాధీనంచేసుకున్న ఇద్దరు ముసుగు వ్యక్తులూ ఎవరో తనకు చూచాయగా తెలుసు. కాని వాళ్లు ఫలానా అని మాత్రం నిర్ధారణగా తెలియలేదు. వాళ్లకే తాను నరసింగభూపతిని అప్పగించాడు. ఎలాగైనా వాళ్ల దగ్గరినుండి తిరిగి నరసింగభూపతిని స్వాధీనం చేసుకో

వాలనే ఉద్దేశంతోనే తాను వాళ్ల ననుసరించి మోసగించ డానికి ప్రయత్నించాడు కూడా.

ఆలోచిస్తూనే యమదూత తన గుహవైపు గబగబా నడచి పోసాగాడు. ఆ ముసుగు వ్యక్తు లిద్దరికీ తన ముఖ్య రహస్యాలేవో తెలిసి ఉంటాయాని తన భయం. అందుచేతనే తానింతగా కంగారుపడిపోవడం. అయినా వాళ్ళెవరో నిర్ధారణగా తెలుసుకుంటే నిజానిజాలు తెలిసిపోతాయి.

ఇంతకూ నరసింగభూపతిని వీళ్ళు ఎక్కడ దాచిందీ తనకు తెలియనేలేదు. తాను తన గుహకు వెళ్ళి కొందరు అను చరులను తీసుకుని వెనక్కి వచ్చేసరికి వీళ్ళిద్దరే కనిపించారు. ఈ లోపలే ఇద్దరూ నరసింగభూపతిని ఎక్కడో దాచి ఉంటారు.

వాళ్లను చూడగానే ఎలాగైనా మాయోపాయంతో వాళ్ళను బంధించాలని తన కనిపించింది. వెంటనే పిచ్చి వాడులా మారువేషం వేసుకుని తాను తన ప్రయత్నం కొన సాగించాడు. తన ప్రయత్నం ఫలించిందికూడా. కాని ఇప్పుడు తానిక ఏం చెయ్యాలి? ఆ ఇద్దరు ముసుగు వ్యక్తుల తోను ఎలా ప్రవర్తించాలి?

ఈ విషయాలన్నీ ఆలోచించుకోవడంకోసమే యమదూత తన అనుచరులను ముందు గుహకు పంపించి తాను వెనక నిలచిపోయాడు. ఏదో పనిమీద ఎక్కడికో వెళ్ళి రావలసి నట్టు తన అనుచరుల ముందు నటించాడు.

ఆలోచనలు తీవ్రమౌతున్నకొద్దీ యమధూత మనస్సు సరిగా పనిచెయ్యడం మానివేస్తున్నట్టయింది. చివరికెలాగైనా

సరే ఆ ముసుగువ్యక్తులద్వారా నయానో భయానో వాళ్ళకు సంబంధించిన విషయం తెలుసుకోవాలని నిర్ణయించుకున్నాడు యమదూత.

ఒక నిర్ణయానికిరాగానే యమదూత వేగాన్ని హెచ్చించి గుహ వైపు త్వరత్వరగా వెళ్ళసాగాడు. అయినా అతని మనస్సును ఏదో ఒక ఆలోచన ఎప్పుడూ వెన్నాడు తూనే ఉంది.

గత జీవితాన్ని తవ్వుకున్న కొద్దీ యమదూతను భయం, కంగారు మిక్కుటంగా ఆవహించసాగాయి—తాను చేసిన ఎన్నో పాప కృత్యాలను మాపుచేసుకోడానికి ఇప్పుడతను ప్రయత్నిస్తున్నాడు. అందుకోసం ఇప్పుడెన్నో మంచిపనులు చేస్తున్నాడు. ఐనా ఏమిటి ప్రయోజనం! వెనుక తాను చేసిన తప్పులు ఇప్పుడు తాను చేసే మంచిపనులను కప్పిపెడు తున్నాయి.

ధైర్యసాహసాలలోను, గూఢచారి విద్యలోను తనను మించగలవాళ్ళు చాల తక్కువమంది ఉంటారు. అయినా ఏమిటి ప్రయోజనం! తన గత జీవితంలోని సంఘటనలు తెలుసుకున్న ఒక అబల దగ్గర కూడా తాను పిల్లిలా బ్రతక వలసిందే.

గతంలో తాను చేసిన తప్పుల్ని కప్పిపెట్టడం ఎంతకూ సాధ్యం కాకుండా ఉంది. వాటికి సంబంధించిన వివరాలు తెలిసిన వాళ్ళు తనను బాధించడానికి ఈ మధ్య ఎక్కువగా ప్రయత్నిస్తున్నారు.

ఇన్ని ఇబ్బందులూ దాటి ఎలా గట్టెక్కడమా, రఘువీర్ మహారాజాదుల ముందు తనను నిర్దోషిగా ఎలా నిరూపించుకోవడమా అనే ఆలోచన అతనిని పట్టుకు పీడించ సాగింది.

# 5

జయంత్, మంత్రవాది సమాలోచన మందిరంలో కూర్చుని ఏవో విషయాలు మాట్లాడుకుంటున్నారు. ఎంత ప్రయత్నించినా జయంత్ మనస్సు రాయదుర్గంలో నిలవడం లేదు. ఇంతవరకు అతను ప్రతాప్‌ను వదలి ఒంటరిగా ఎన్నడూ ఉండలేదు. అంతే కాకుండా లావణ్య, భవానీలకు సంబంధించిన ఎటువంటి వార్తలూ అతని కందడం లేదు.

ఈ పరిస్థితులలో అతను రాయదుర్గంలో ఒంటరిగా ఉండగలగడం అసంభవంగానే కనిపించసాగింది. ఇక్కడ తన కంత ముఖ్యమైన పనులేమీ లేవుకూడా. తాను వచ్చినప్పటినించి ఇప్పటివరకు నిజానికి ఒక్క పనికూడా ఏదీ చేతికి తగలలేదు. చిన్న చిన్న పనులన్నీ మంత్రిలా మంత్రవాది చూసుకుపోతూనే ఉన్నాడు.

ఒక భటుడు గదిలోకివచ్చి అక్కడున్న ఇద్దరికీ నమస్కారాలు చేశాడు.

"ఏమిటి విశేషం?" మంత్రవాది ఆ భటుడిని అడిగాడు.

"భూగృహంనించి వార్తాహరు డొకడు వచ్చాడు. రఘువీర్ మహారాజాగారి దగ్గరనించి ఒక ఉత్తరం తీసుకు వచ్చాడు," భటుడన్నాడు.

"వెంటనే ఆ భటుడిని లోపలికి పంపించు," జయంత్ ఆజ్ఞాపించాడు.

భటుడు వెళ్ళిపోయిన కాసేపట్లో ఒక వ్యక్తి ఆ గదిలోకి వచ్చి జయంత్‌కు, మంత్రవాదికి సవినయంగా అభివాదనాలు చేశాడు.

"భూగృహంనించేనా రావడం! ఏమిటి విశేషాలు," అని అతనిని ప్రశ్నించాడు మంత్రవాది.

"అక్కడ అందరూ క్షేమంగానే ఉన్నారు. రాయదుర్గంలోంచి తప్పించుకుపోయిన మహామాయ భూగృహంలో తిరిగి బంధించబడినట్టుగా మహారాజుగారు తమకు తెలియచేయమన్నారు. తర్వాత యమదూత నరసింగ భూపతిగారిని ఖైదునుండి విడిపించి తీసుకు వచ్చిన సంగతి కూడా మీకు చెప్పమన్నారు. ఇక పోగా అన్ని విషయాలతోను మీకొక లేఖ సమగ్రంగా వ్రాసి నాకిచ్చి పంపారు," వార్తాహరుడన్నాడు.

మంత్రవాది అతడందించిన ఉత్తరాన్ని తీసుకుని మడత విప్పాడు. జయంత్‌కుకూడా తెలియడంకోసం దానిని బిగ్గరగా చదివి వినిపించాడు.

"శ్రీ జయంత్ గార్కి, రఘువీర్ మహారాజుగారి అనుజ్ఞ మీద బాబాజీ స్వయంగా వ్రాసిపంపే విషయాలు—

ఇక్కడి సంగతులన్నీ మీకు వార్తాహరుడి వల్ల తెలిసే ఉంటాయి. మహామాయ ఇక్కడ తిరిగి బంధించ బడింది. నరసింగభూపతిగారు లభించారు. నేపాళి ఇక్కడకు

వచ్చాడు. కొద్ది రోజులు ఉండవలసిందిగా షేం అతని నిక్కడ ఆపి మీ వద్దకు వార్తాహరుణ్ణి పంపుతున్నాం.

మరొక ముఖ్య విశేషమేమిటంటే అనేక కష్టాల అనంతరం చాలా కాలానికి తిరిగి రఘువీర్ మహారాజుగారు సతీ సమేతంగా పట్టాభిషేకమహోత్సవం జరుపుకోబోతున్నారు. ఆ ఉత్సవ సందర్భంగా మీకు ఆహ్వానాన్ని పంపుతున్నాం. మంత్రవాదిగారితో సహా బయలుదేరి రావలసిందిగా కోరుతున్నాం.

పట్టాభిషేక మహోత్సవానంతరం ఖైదీల నందరినీ విచారించడం ఒక పనిగా పెట్టుకున్నాం. కాబట్టి మీ రాయదుర్గంలో బందీగా ఉన్న సాధును జాగ్రత్తగా భూగృహానికి పంపించవలసిందిగా మా మనవి.

ఇంతే సంగతులు.—

బాబాజీ."

మహామాయ, నరసింగభూపతికి సంబంధించిన వార్తలు జయంత్‌కు, ముఖ్యంగా మంత్రవాదికి ఎంతో ఆనందాన్ని కలిగించాయి. తమ ఆధీనంలోని రాయదుర్గంలో బంధింపబడిన మహామాయ సులభంగా విడిపించబడడం మంత్రవాదికి సిగ్గుచేటనిపించింది. అందుచేతనే ఆమె ఎక్కడ కనిపిస్తే అక్కడ బంధించి తీసుకురమ్మని అనేకమంది భటులను, గూఢచారులను మంత్రవాది పంపాడు కూడా.

జయంత్ మంత్రవాదివంక చూసి అన్నాడు.

'భగవంతుడు మన కనుకూలంగా ఉన్నాడు. లేకపోతే ఇటువంటి విచిత్ర సంఘటన జరగదు. మహామాయ తప్పిం

చుకు పోయినందుకు మన మెంత గానో విచారించాం. కాని ఆ సమస్య ఇట్టే పరిష్కారమైపోయింది."

మంత్రవాది ఆనందంగా మందహాసం చేస్తూ భూగృహం నించి వచ్చిన వార్తాహరుణ్ణి వెళ్ళిపోవలసిందిగా సంజ్ఞ చేశాడు. మరుక్షణంలో వార్తాహరు డక్కడినించి బయటికి వెళ్ళిపోయాడు.

'చిత్రగృహంలో బందీగా ఉన్న సాధును భూగృహానికి పంపించేందుకు తగిన ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయిస్తాను. ఆ వెంటనే మనం కూడ భూగృహానికి వెళ్ళేందుకు కావలసిన ఏర్పాటులు చేసుకోవాలి. మళ్ళీ తిరిగి వచ్చేవరకు సమర్థుడైన ఒక వ్యక్తిని ఇక్కడ పరిపాలకుడుగా మనం ఏర్పరచాలి," అన్నాడు మంత్రవాది జయంత్‌తో.

జయంత్ మంత్రవాదికి జవాబు చెప్పకముందే బయటి నుంచి ఏదో కోలాహలం వినిపించింది. జయంత్, మంత్రవాది ఆతురతగా బయటికి చూశారు గాని ఎవరూ కనిపించ లేదు.

వెంటనే మంత్రవాది లేచి బయటికి వెళ్ళాడు. అక్కడ అతను చూసిన దృశ్యం అతని కెంతో ఆశ్చర్యాన్ని కలిగించింది.

పూర్వపు రాయదుర్గాధిపతి కాలంలో చిత్రగృహాధిపతిగా ఉన్న అగ్నివర్మను తమ భటులు కొందరు బలవంతంగా ఈడ్చుకు రావటం అతను చూశాడు. ఈ మధ్య కాలంలో ఎప్పుడూ అతను అగ్నివర్మను చూడలేదు. అసలు అగ్నివర్మను యమదూతే చంపినట్టుగా కూడా అతనికి గుర్తు.

అలాంటిది అతనిని అకస్మాత్తుగా ఇక్కడ చూడగానే మంత్రవాది విస్తుపోయాడు.

ఇంతలో భటులు అగ్నివర్మను మంత్రవాది వద్దకు తీసుకుని వచ్చారు.

"ఈ వ్యక్తి గోరీల వైపునుంచి దొంగతనంగా చిత్రగృహంలోకి ప్రవేశించడానికి ప్రయత్నించడం చూసి మేం ఇక్కడికి తీసుకువచ్చాం," అన్నాడొక భటుడు మంత్రవాదితో.

మంత్రవాది తనముందు మౌనంగా నిలబడి ఉన్న అగ్నివర్మ వంక పరీక్షగా చూశాడు. 'ఇక్కడ ఇతనిని వదలి వెళ్లండ'ని భటుల నాజ్ఞాపించాడు.

మంత్రవాదికెదురుగా అగ్నివర్మను వదలి భటులు తమ స్థానాలకు వెళ్ళిపోయారు. కాసేపటికి అక్కడ నిశ్శబ్దం ఆవరించింది. మంత్రవాదిగాని, అగ్నివర్మగాని ఎవరూ మాట్లాడలేదు.

నిశ్శబ్దాన్ని చీలుస్తూ మంత్రవాది నెమ్మదిగా అన్నాడు.

"ఇంతకాలంవరకు కంటికగుపించని మీరు ఈ రోజకస్మాత్తుగా కనిపించడం ఆశ్చర్యంగానే ఉంది. అందులోనూ ముఖ్యంగా తిరిగి చిత్రగృహంలోకి ప్రవేశించడానికి ప్రయత్నించడం మరీ ఆశ్చర్యకరం."

అగ్నివర్మ తలెత్తి మంత్రవాది వంక చూశాడు. తడుముకోకుండా వెంటనే సమాధాన మిచ్చాడు.

'మా మహారాజుగారు సంహరింపబడిన అనంతరం నేను అక్కడక్కడా తిరుగుతూ పొట్టపోసుకోసాగాను. తర్వాత

కిశోర్ గారి నాశ్రయించి కొద్దిరోజులున్నాను. అయితే ఆయనకూ, నాకూ సరిపడలేదు. ఆయన తిరిగి రాయదుర్గం మీద దండెత్తడానికి ప్రయత్నిస్తున్నాడు. ఆ ప్రయత్నం నాకు నచ్చలేదు. అందుచేత నన్నాయన వెళ్లగొట్టారు. చివరికి నే నిక్కడికి మీ ఆశ్రయం సంపాదించడానికి బయలుదేరాను.''

''అయితే తిన్నగా రాజమార్గాన రావచ్చుగ. చాటుగా చిత్రగృహంలో ప్రవేశించడానికి ప్రయత్నించడం దేనికి ?'' మంత్రవాది మళ్లీ అడిగాడు.

''రాయదుర్గంకు నాకు చిత్రగృహంతో ఎక్కువ సంబంధం ఉన్న విషయం మీకు తెలుసుగా. చిత్రగృహం లోంచి నేనెప్పుడు బయటికివెళ్ళి లోపలికి వచ్చినా ఆ మార్గానే ప్రయాణిస్తూండేవాడిని. అలవాటు ప్రకారం ఈ రోజుకూడా అలే బయలుదేరాను,'' అగ్నివర్మ సమాధాన మిచ్చాడు.

'కాని ఇప్పుడు చిత్రగృహం మీ అధీనంలో లేదన్న సంగతి మీకు తెలుసుగా. తెలిసికూడా ఆ మార్గాన చిత్ర గృహంలో ప్రవేశించడానికి ప్రయత్నించడంలో మీ ఉద్దేశం ?'' మంత్రవాది పరిహాసంగా, కొంచెం కటువుగా అడిగాడు.

''నేను చేసిన పొరపాటును క్షమించండి,'' అగ్నివర్మ దీనంగా అన్నాడు.

మంత్రవాది అగ్నివర్మ వంక చూస్తూ వికటంగా నవ్వాడు.

''ఇది క్షమించడానికి తగిన సమయం కాదు. ప్రతి విష

యాన్ని పరిశీలించి తెలుసుకోవలసిన సమయం. నీ విషయంలో నన్నొక ముఖ్యమైన అనుమానం పీడిస్తోంది. అగ్నివర్మను చిత్రగృహంలో తాను సంహారించినట్టుగా యమదూత నాతో అన్నాడు. అలాంటప్పుడు నువ్విక్కడ అకస్మాత్తుగా ప్రత్యక్షం కావడంలోని గూఢ భావం ?"

అగ్నివర్మ ఈ మాట విని కంగారుపడిపోయాడు. ఒక నిమిషం మౌనం వహించి తర్వాత నెమ్మదిగా అన్నాడు.

"యమదూత పొరపాటు పడి ఉండవచ్చు."

"అనుమానాల కిక్కడ ఆస్కారంలేదు. నువ్వు అసలు అగ్నివర్మవో కాదో నిర్ణయించడం అంత కష్టమైన పని కాదు. అందుకిప్పుడే ఏర్పాటు చేస్తాను," అంటూ మంత్రవాది గంభీరంగా ఒక్కడుగు ముందుకు చేశాడు. ఓసారి నాలుగు ప్రక్కలకు తన చూపులు పోనిచ్చాడు.

తన వెనకగా ఉన్న అగ్నివర్మ చిన్నకత్తిని బయటికి లాగడం మంత్రవాది కంట పడింది. అతను వెంటనే వెనక్కి తిరిగి చప్పట్లు కొట్టాడు. మరుక్షణంలో ఇద్దరు ముగ్గురు భటులు అక్కడికి పరుగెత్తుకు వచ్చారు.

"ఈ దుర్మార్గుణ్ణి పట్టుకు బంధించండి. బలవంతంగా అతని మారువేషాన్ని తొలగించి జయంత్ గారి దగ్గరకు తీసుకురండి. నేనక్కడ ఉంటాను," అని అరిచాడు మంత్రవాది.

భటులు అగ్నివర్మమీదికి దూకి అతని చేతిలోని చిన్నకత్తిని లాగివేశారు. తర్వాత అతని నక్కడినుంచి ఓప్రక్కగా

తీసుకు వెళ్ళారు. మంత్రవాది వెంటనే జయంత్ దగ్గరికి బయలుదేరాడు.

"ఏమిటా గల్లంతు?" జయంత్ ఆతురతగా ప్రశ్నించాడు.

మంత్రవాది కొంచెం గంభీరంగానే అన్నాడు.

"పరిస్థితుల్ని బట్టి చూస్తే మళ్ళీ ఏదో అవాంతరం మన కేర్పడబోతోంది. పూర్వపు చిత్రగృహాధిపతి అగ్నివర్మ వేషంలో ఎవరో చిత్రగృహంలో దొంగతనంగా ప్రవేశించబోతుండగా భటులు చూసి పట్టుకున్నారు."

"ఆ వ్యక్తి ఎవరో తెలియలేదా?"

"కాసేపటిలో తెలుస్తుంది. అతని నిప్పుడు భటులిక్కడికి అసలు వేషంలో తీసుకువస్తారు."

మంత్రవాది చెబుతూండగానే భటులొక వ్యక్తిని తీసుకుని లోపలికి వచ్చారు. అతనిని చూడగానే జయంత్ కు, మంత్రవాదికి ఆశ్చర్యం కలిగింది.

"కిరణ్మయి అన్న. మీరు గుర్తుపట్టారు కదూ!" అన్నాడు మంత్రవాది జయంత్ తో.

"ఔను. కాని ఇతనిని మనం మన కోటకు ఖైదీగా పంపినట్టు గుర్తు. ఇప్పుడిక్కడికెలా వచ్చాడో తెలియకుండా ఉంది," జయంత్ అన్నాడు.

మంత్రవాది ఆ వ్యక్తివంక చూస్తూ గంభీరంగా ప్రశ్నించాడు.

"మా చేతికి చిక్కాంతర్వాత ఇక తప్పించుకుపోవడం సాధ్యంకాని పని. నిజానిజాలు తెలుసుకోవాలని మాకు

కుతూహలంగా ఉంది. ప్రతాప్‌గారు నిన్ను కోటకు బందీగా పంపినప్పటినించి జరిగిన సంగతులు చెప్పు. నీమీద నమ్మకం కలిగితే నిన్ను క్షమించి ప్రాణాలతో వదలి వేయడానికి ప్రయత్నిస్తాం. లేకపోతే చిత్రగృహంలో బంధించి శిక్షిస్తాం."

కిరణ్మయి అన్న ఒక్క నిమిషం తలవంచుకు మౌనంగా నిలబడ్డాడు. తర్వాత హీన స్వరంలో నెమ్మదిగా అన్నాడు.

"జరిగిన సంఘటనలను గురించి ఆలోచించిగాని విచారించిగాని ఇప్పుడు ప్రయోజనంలేదు. వాటిని తలచుకుంటే నా కిప్పుడు బాధగా ఉంది.

'అయినా జరిగిన విషయాలను యథాతథంగా మీకు చెప్పడానికి నిశ్చయించుకున్నాను. కిరణ్మయిని అపహరించి సంహరించడానికి మా తండ్రిగారి ఆజ్ఞప్రకారం నేను మధ్య రాజ్యానికి వచ్చాను. కాని ఆనాటి ప్రయత్నం సఫలం కాలేదు. నేను ప్రతాప్‌గారిచేత బంధించబడ్డాను. అనంతరం కొందరు భటులు నన్ను మహారాజుగారి కోటకు తీసుకువెళ్లడానికి బయలుదేరారు. కాని దారిలో ఈ సంగతి తెలిసిన మా నాన్నగారు ఆ భటుల చేతినుండి నన్ను విడిపించారు.

"కిరణ్మయిని రాయదుర్గాధిపతి భటులు ఎత్తుకుపోయారనీ, వెళ్ళి ఆమె విషయం చూడమనీ నాన్నగారు నన్ను రాయదుర్గానికి పంపారు. నేను చిత్రగృహంలో ఎలాగో ప్రవేశించి కిరణ్మయి నేదో విధంగా చేజిక్కించుకోడానికి ప్రయత్నించాను. కాని ఈ ప్రయత్నం కూడా నెరవేరలేదు. చిత్రగృహం మీ స్వాధీనంలోకి వచ్చింది. తర్వాత రాయ

దుర్గాధిపతి నరేంద్రమహారాజును మోసగించి బంధించిన విషయంకూడా నాకు తెలుసు. నేనా సమయంలో చిత్ర గృహంలోనే రహస్యంగా దాక్కి ఉన్నాను. ఒకసారి చిత్ర గృహంలో అకస్మాత్తుగా నన్ను చూసిన మంజుల సహాయకురాలు వరూధినిని చంపిందికూడా నేనే."

"అదా సంగతి. ఆమె నెవరు చంపారో తెలుసుకోలేక నేనా సమయంలో తన్నుకున్నాను," అన్నాడు అప్రయత్నంగా మంత్రవాది.

"తరువాతేం జరిగింది?" జయంత్ అడిగాడు.

"యమదూత చిత్రగృహాధిపతి అగ్నివర్మను గొంతునులిమి చంపి మహారాజాదులను పిడిపించడంకూడా నేను స్వయంగా చూశాను. ఇక కిరణ్మయి నాచేత చిక్కడం అసంభవమని నేను నిర్ణయించుకున్నాను అందుచేత ఏదో విధంగా మిమ్మల్ని మోసగించడానికి పూనుకున్నాను. చనిపోయిన అగ్నివర్మ వేషం వేసుకుని చిత్రగృహంలోంచి రహస్యంగా బయటపడ్డాను.

"ఆసమయానికి కిశోర్ విడచి వేయబడ్డాడు. మార్తాండుడితో సహా నేనతనిని కలుసుకోవడం సంభవించింది. రాయదుర్గాన్ని ఏ విధంగానైనా తిరిగి స్వాధీనం చేసుకోవడం అతని ఉద్దేశం. నా మారువేషాన్ని ఎవరూ గుర్తించలేక పోయారు. కిశోర్‌తో కలిసి మీమీద పగతీర్చుకోవాలని నేనభిలషించాను. ఆ ఉద్దేశంతో ఈ మధ్యకాలమంతా నేనతని దగ్గర ఉన్నాను.

"కిశోర్ రకరకాలుగా రాయదుర్గాన్ని స్వాధీనంచేసుకో డానికి ప్రయత్నించాడు. కాని అతని ఏ ప్రయత్నమూ ఇంతవరకు కార్యరూపాన్ని ధరించలేదు. అక్కడ ఉన్న సమయంలోనే మా నాన్నగారు రాయదుర్గం మీదకి దండెత్తడం, దారిలో సంహరించబడడం వగైరా వార్తలు నాకందాయి.

"అంతటితో నా మనస్సు ఆందోళన చెందింది. ఒక ప్రక్క పగతీర్చుకోవాలనే వాంఛ, మరొక ప్రక్క నిరాశ, నన్ను వేధించసాగాయి. ఒక వారం రోజులు ఇంటిలో కూర్చుని తీవ్రంగా ఆలోచించాను. ఆలోచించి చూసిన కొద్దీ మా తండ్రిచేసిన పనులు నాకు సబబుగా కనిపించలేదు. కిరణ్మయి ప్రతాప్‌ను ప్రేమిస్తున్నప్పుడు మేం అడ్డగించవలసినంత అవసరం నాకు కనిపించలేదు.

"నేనీ ఆలోచనలో మునిగిఉన్న సమయంలోనే కిశోర్, మార్తాండుడు కలిసి రాయదుర్గంమీద దండెత్తడానికి సన్నాహాలు చేశారు. కాని మంత్రవాది అంటే ఆ ఇద్దరికీ కొంత భయమే. అందుచేత అతని నెలాగైనా మోసగించి బంధించవలసిందిగా కోరి నన్ను పంపారు.

"ఏం చెయ్యడమా అనే ఆలోచనతోనే ఇంతదూరం వచ్చాను. అయితే ఇప్పుడా సమస్య తీరిపోయింది. నా మనస్సు ఒక నిశ్చయానికి వచ్చింది. అందుచేతనే నేను అన్ని విషయాలూ చెప్పివేశాను. ఇంతకు క్రితం నేనుచేసిన నేరాలను మీరు క్షమించినాసరే, లేదా నన్ను శిక్షించినా సరే."

"కిశోర్, మార్తాండుడు ససైన్యంగా రాయదుర్గంమీదకి దండెత్తి వస్తున్నారన్నమాట!" మంత్రవాది అడిగాడు.

'ఔను. మరొక ముఖ్యవిషయం ఈ సందర్భంగా నేను మీకు చెప్పవలసి ఉంది. కిశోర్ ఏదో సొరంగ మార్గంద్వారా సైన్యాన్ని రాయదుర్గంలోకి తీసుకు రావడానికి ప్రయత్నిస్తున్నాడు. ఆ సొరంగ మార్గానికి సంబంధించిన వివరాలు మాత్రం నాకు తెలియవు," అన్నాడు కిరణ్మయి అన్న.

అతనిని తీసుకుపోయి బంధించవలసిందిగా మంత్రవాది భటులకు సంజ్ఞ చేసి జయంత్ వైపు చూశాడు. భటులక్కడినించి వెళ్ళిపోయారు. ఆ ప్రశాంత వాతావరణంలో జయంత్ అడిగాడు.

"ఆ సొరంగ మార్గం విషయం మీకు తెలుసుననుకుంటాను."

"తెలుసు. అక్కడ తగిన బందోబస్తు నేను చేయిస్తాను. ఇతను చెప్పిన విషయాలన్నీ నిజమో కాదో తెలుసుకురావడానికి కొందరు గూఢచారులను పంపుతాను. ఎందుకైనా మంచిది, ముందుగానే సాధును తగిన ఏర్పాట్లతో భూగృహానికి పంపుతాను. ఈ పనులన్నీ చూసుకు వచ్చిం తర్వాత మిగిలిన విషయాలు మాట్లాడుకుందాం," అంటూ మంత్రవాది అక్కడినించి బయటికి నడిచాడు.

యమదూత గుహను చేరుకునేసరికి భూగృహాన్నించి వచ్చిన వార్తాహరు డందించిన లేఖను అతని అనుచరులతని కిచ్చారు. అత నా ఉత్తరాన్ని ఆతురతగా చదవ నారంభించాడు.

నరసింగభూపతి తిరిగి వచ్చిన విషయం, రఘువీర్ మహారాజా పట్టాభిషేకానికి సంబంధించిన ఆహ్వానం అందులో ఉన్నాయి. నరసింగభూపతి విషయం యమదూతకు అంతులేని ఆశ్చర్యాన్ని కలిగించింది.

నరసింగభూపతిని వదలివేసే పక్షంలో అతవినంత శ్రమపడి ఆ ముసుగు వ్యక్తు లెందుకు తీసుకువెళ్ళినట్టు! అతనిని తమ కప్పగించవలసిందిగా తన నంత బాధించేడం దేనికి! యమదూత కేమీ తోచలేదు.

తిరిగిఏదైనా మోసం జరగలేదుకదా! నరసింగభూపతి వేషంలో మరెవరైనా భూగృహంలో ప్రవేశించలేదుకదా! యమదూత మనస్సులో ఏవో అనుమానాలు, సందేహాలు చెలరేగాయి.

యమదూతకెదురుగా ఆ ఇద్దరు వ్యక్తులు స్పృహ కోల్పోయి ఉన్నారు. ముసుగులు తొలగించి వేయబడినాయి. వాళ్ల మొఖాలవంక చూస్తూ యమదూత కాసేపు మౌనంగా నిలబడ్డాడు.

"ఈ ఇద్దరికీ వెంటనే స్పృహ తెప్పించండి," కాసేపాగి యమదూత తన అనుచరుల నాజ్ఞాపించాడు. మరు నిము

పంలో అనుచరులా ఇద్దరు వ్యక్తులకు స్పృహ తెప్పించారు.

స్పృహలోకి రాగానే ఆ ఇద్దరూ తమ కెదురుగా ఉన్న యమదూతను, అతని అనుచరులను చూశారు.

"ఇదంతా నువ్వు చేసిన మోసమేనన్నమాట. మమ్మల్ని పట్టుకోడానికి ఇంత కుట్రపన్నావన్నమాట," అందులో ఒకతను యమదూత వంక చూసి కొంచెం కోపంగా అన్నాడు.

"ఔను. మీతో పని ఉండి నేనిలా చెయ్యవలసి వచ్చింది," యమదూత సమాధానంగా అన్నాడు.

"ఏమిటా పని ?"

"మరేమీ లేదు. నరసింగభూపతిని తిరిగి నాకు స్వాధీనం చెయ్యమని కోరదామని—"

ఆ ఇద్దరు వ్యక్తులూ వికటంగా నవ్వారు. "ఇందుకోసమా నువ్వీపని చేసింది! నరసింగభూపతిని మేం ఎప్పుడో వది లేశాం. అతనీపాటికి భూగృహంలో ఉండి ఉంటాడు."

"కాని మీమాటలమీద నాకు నమ్మకం కలగడంలేదు," యమదూత సందేహంగా అన్నాడు.

"నమ్మకం కలగకపోతే అందుకు బాధ్యులం మేం కాము. నీకు మామీద నమ్మకం ఉన్నా లేకపోయినా చెయ్య గలిగిందేమీ లేదు," అందులో ఒక వ్యక్తి అన్నాడు.

యమదూత చిరుకోపంతో వాళ్ళవంక చూసి గంభీరంగా అన్నాడు.

"యమదూత చేతులు కట్టుకు కూర్చోలేదని గ్రహించండి. అతను తలచుకుంటే ఏమైనా చేయగలడు. మిమ్మల్ని

ప్రాణాలతో హింసించడానికి ఏ విధంగానూ సంశయించడు."

అందులో మొదటి వ్యక్తి వికటంగా నవ్వుతూ అన్నాడు.

"నువ్వు మాకే ఎదురుతిరగడానికి పూనుకున్నావన్న మాట. ఈ సాహసం నువ్వు భూగృహంలో నరసింగ భూపతిని మా కప్పగించినప్పుడు చెయ్యలేకపోయావే?"

"ఎదురు తిరిగితే భూగృహంలో అనవసరమైన గొడవ జరుగుతుందేమోనని భయపడ్డాను. ఇప్పుడలాంటి భయం ఏమీ లేదు. అందుచేతనే మిమ్మల్నిక్కడికి తీసుకువచ్చింది," అన్నాడు యమదూత.

"సరే. చేతులారా నిన్ను నువ్వే సర్వనాశనం చేసుకోడానికి ప్రయత్నిస్తున్నావన్నమాట. గత జీవితంలో నువ్వు చేసిన ఘోర కృత్యాలను గురించి మేం లోకానికి తెలియ చెప్పినా నువ్వు భయపడబోవన్నమాట," ఆ వ్యక్తి తిరిగి అన్నాడు.

ఈ మాట యమదూత మనస్సును కలవరపరచింది.

"అసలు మీ రెవరో నేను తెలుసుకోవాలనుకుంటున్నాను," అన్నాడు హీనస్వరంలో.

ఆ వ్యక్తి బిగ్గరగా నవ్వుతూ పరిహాసంగా అన్నాడు.

"మే మెవ్వరమో గుర్తుపట్టకుండానే నువ్వు నరసింగ భూపతిని మా కప్పగించావన్నమాట. బాగుంది. ఈ మాత్రం మమ్మల్ని పోల్చుకోలేకపోయావా?"

"ఎక్కడో చూసినట్టు గుర్తుంది కాని ఎవరో ఇదమిత్థంగా తేల్చుకోలేక పోతున్నాను," యమదూత వాళ్ళ వంక మరో సారి పరిశీలనగా చూస్తూ అన్నాడు.

"నేను రుద్రదేవుడిని. ఇప్పుడైనా నన్ను పోల్చుకో గలవా?" మొదటి వ్యక్తి గంభీరంగా ముఖం పెట్టి అన్నాడు.

అతని పేరు వినగానే యమదూత మొఖం పాలిపోయి నట్టయింది. ప్రాణంలేనివాడిలా ఓసారి కంగారుగా అన్ని ప్రక్కలా చూసి దీనంగా అన్నాడు.

"మీా రెవరో సరిగా తెలుసుకోకుండా మిమ్మల్ని బంధించాను. ఇప్పుడు కూడా నేను మిమ్మల్ని పోల్చుకోలేకుండా ఉన్నాను. కారణం తెలియకుండా ఉంది."

"కాలంతోపాటు ఆకారంలోకూడా ఏమయినా మార్పు వచ్చి ఉండవచ్చు. పోనీ ఇంకా నీకు నా మాటమీాద నమ్మకం లేకపోతే నేనెవరో నీకు ఖాయంగా తెలిసేట్టు కొన్ని సంఘటనలను గుర్తుచేస్తాను," అన్నాడు రుద్రదేవుడు.

యమదూత మౌనం వహించాడు. కాసేపటివరకు ఏమీా మాట్లాడలేకపోయాడు.

"నువ్వు యువరాజును హత్యచేసిన విషయం ఇంతవరకు మా ఇద్దరికీ తప్ప మరెవరికీ తెలియదు," ఆ వ్యక్తి అన్నాడు.

ఈ మాట విన్న మరుక్షణంలో యమదూత పిచ్చివాడిలా అరిచాడు.

"ఇక చెప్పకండి. చాలు. మిమ్మల్ని మోసగించి ఇక్కడికి తీసుకువచ్చినందుకు క్షమించండి. ఇప్పుడు స్వేచ్ఛగా

మిమ్మల్ని వదలి వేస్తున్నాను. మీ గుర్రాలను మీ కప్పగిం చేట్టు చేస్తాను. మీ ఇష్టం వచ్చిన చోటికి వెళ్ళవచ్చు."

యమదూత కంగారును చూసి ఆ వ్యక్తులిద్దరూ మళ్ళీ వికటంగా నవ్వారు. యమదూత అనుచరులు ఈ సంఘట నకు విస్తుపోతూ యథాస్థలాలలో నిలబడిపోయారు.

యమదూత అజ్ఞ ప్రకారం ఆ ముసుగు వ్యక్తుల గుర్రాలు రెండూ తేబడినాయి. వెంటనే ఆ ఇద్దరూ గుర్రాల మీద కెక్కి వెనక్కి తిరిగారు. మరుక్షణంలో గుర్రాలు రెండూ బాణాల్లా దూసుకుపోసాగాయి.

యమదూత ఏమీ తోచని పరిస్థితిలో పిచ్చి వాడిలా అక్కడే నిలబడిపోయి వెళ్ళిపోతున్న గుర్రాలవంక చూడ సాగాడు.

# 7

"నేను పంపిన గూఢచారులు కొందరు తిరిగి వచ్చారు. కిశోర్, మార్తాండుడు ససైన్యంగా రహస్యంగా రాయ దుర్గంమీదకి దండు వెడలిన విషయం నిజమే," అన్నాడు మంత్రవాది జయంత్‌తో.

"ఎదురుగా వచ్చి పోరాడి ఎవరూ మనల్నేమీ చెయ్య లేరు. అందులోను స్వతహాగా బలవత్తరమైన రాయదుర్గం శత్రువులకు దుర్భేధ్యమైనది. మన దగ్గర సైనికులు తక్కువ మంది ఉన్నారని మనం కంగారుపడ నక్కరలేదు," జయంత్ ధీమాగా అన్నాడు.

"నేను సైనికుల్ని గురించి ఆలోచించడంలేదు. వాళ్ళు ఎదురుగా వచ్చి యుద్ధం చెయ్యడానికి సిద్ధపడడంలేదు. రహస్యమార్గాన రాయదుర్గంలో సైనికులతోసహా ప్రవేశించ డానికి పన్నాగం పన్నారు."

"ఆ రహస్య మార్గం మీకు తెలుసునన్నారు కదూ!"

"ఒక సొరంగ మార్గం మాత్రం నాకు తెలుసు. మహా మాయ, మంత్రి సాధు, జయసింహుడు ఆ సొరంగం గుండానే సైన్యాన్ని తీసుకురావడానికి ప్రయత్నించి విఫలు లయ్యారు."

'ఆ సొరంగ మార్గం దగ్గర మన సైనికులను కట్టు దిట్టంగా కాపుంచే ఏర్పాట్లు చేయించారు గదూ?"

"అవన్నీ అయిపోయాయి. కాని నాకు మరో ఉపాయం తడుతోంది. కోట చుట్టూ కొందరు సైనికులను కాపుంచి మనం కిశోర్‌ను సొరంగంలో ప్రవేశించకముందే ఎదు ర్కొంటే బాగుంటుందేమో!"

"కాని ఆ సొరంగం ఎక్కడినించి బయలుదేరుతుందో తెలియాలిగా."

"అది నాకు తెలుసు."

"అయితే అలాగే చేద్దాం. ఇక ఇక్కడ మనిం చూసు కోవల్సిన పనులు మరేమీ లేవుగా?"

"ఏమీ లేవు. సాధును కొందరు సమర్థులైన భటులద్వారా భూగృహానికి పంపాను. ఇప్పుడు మనం కిశోర్‌ను ఎదుర్కో వాల్సిన పని తప్ప మరేమీలేదు."

కోటలో ఉన్న కొద్ది సైన్యాన్ని వెంట పెట్టుకుని జయంత్, మంత్రవాది నదీతీరానికి బయలు దేరారు. మంత్రవాది ఆ ప్రాంతంలో సొరంగమార్గం ఉండవలసిన చోటు కోసం పరీక్షించి చూశాడు. చివరికొక స్థలాన్ని నిర్ణయించి ఆ ప్రాంతంలోనే చెట్లమీద, చెట్లచాటున తమ సైన్యాన్ని ఎవరికీ కనిపించకుండా దాచాడు.

జయంత్, మంత్రవాదికూడా దగ్గర్లోనే ఉన్న ఒక పెద్ద దిబ్బ వెనక దాగారు. తమ గూఢచారు లందించిన వార్త ప్రకారం కాసేపట్లోనే కిశోర్ సైనికు లాప్రాంతానికి రావలసి ఉంది. అందుకనే వాళ్లకోసం ఎదురు చూస్తూ యుద్ధ సన్నాహంలో ఉన్నారు జయంత్, మంత్రవాది.

కాసేపటిలో ఒక చెట్టుమీదున్న సైనికుడు చప్పట్లు కొట్టి హెచ్చరించడంతో కిశోర్ సైనికులు వస్తున్నట్టుగా అందరికీ తెలిసింది. మంత్రవాది దిబ్బచాటునుంచి కొంచెం ప్రక్కకు వచ్చి పరీక్షగా చూశాడు.

దూరంనించి గుర్రాలమీద వేగంగా ముందుకు వస్తున్న కొందరు సైనికులు అతని కంటపడ్డారు. మరుక్షణంలో అతను తమ సైనికులనందరినీ సంజ్ఞా పూర్వకంగా హెచ్చరించాడు.

శత్రుసైనికులు దూసుకు వచ్చారు. జయంత్ ప్రళయ రుద్రుడిలా ముందుకు దూకి ఒక శత్రు సైనికుడిని సంహరించి అతని గుర్రంమీదకి దూకాడు. శత్రుసైనికుల మధ్య నించి బాణంలా దూసుకుపోయి కిశోర్ గుర్రం ముందు ఆగాడు.

మంత్రవాది స్వయంగా మార్తాండుడిని ఎదుర్కోవలసి వచ్చింది. సైనికులలో కత్తి యుద్ధం, ముష్టి యుద్ధం జరుగుతోంది. కాసేపట్లోనే రణరంగం భయావహంగా తయారైంది. రక్తం ఏరులై ప్రవహించసాగింది. శవాలు ఒకదాని మీద ఒకటి పడి నేలమీద పేరుకుపోసాగాయి.

గాయపడినవారి ఆక్రందనాలు దిక్కుల పిక్కటిల్లుతున్నాయి. సంగ్రామం సమసిపోలేదు. ముఖ్యంగా జయంత్ కిశోర్‌ల యుద్ధం ప్రశంసార్హంగా ఉంది.

ఇరుపక్షాలలోను చాల మంది హతులయ్యారు. అనుకోకుండా జరిగిన ఈ యుద్ధంలో యుద్ధానికి సంసిద్ధంగా లేని కిశోర్ సైనికులు అధికంగా నేలకూలారు.

పరాజయం తమకు తప్పదనుకొన్న పరిస్థితిలో మార్తాండుడు తప్పించుకు పారిపోవడానికి ప్రయత్నించాడు కాని లాభం లేకపోయింది. మంత్రవాదిచేతిలో అతనికి చివరికి చావు తప్పలేదు.

జయంతుతో యుద్ధం చేస్తున్న కిశోర్ చేతిలోంచి కత్తి జారి క్రింద పడింది.

"శరణువేడితే ప్రాణాలు కాపాడడానికి సిద్ధంగా ఉన్నాను," జయంత్ విజయాట్టహాసం చేస్తూ బిగ్గరగా అన్నాడు.

కిశోర్, ప్రతాప్ జయంత్‌ల బలపరాక్రమాలను గురించి విన్నాడు. అయినా వాళ్ల శక్తి సామర్థ్యాల విషయం ఇప్పుడుగాని అతని కవగాహన కాలేదు.

కిశోర్ తలవంచుకుని గుర్రంమీదనించి దిగాడు. జయంత్ కూడా ఆనందంతో తన సైనికులను యుద్ధం చెయ్యడం నిలిపి వెయ్యవలసిందిగా ఆజ్ఞాపించి అశ్వావరోహణం చేశాడు.

యుద్ధం ఆగిపోయింది. చనిపోగా మిగిలిన కిశోర్ సైనికులు ప్రాణాలతో బయటపడడంకోసం పరుగు లంకించుకున్నారు.

మంత్రవాది ఆజ్ఞప్రకారం కిశోర్ బంధించబడ్డాడు. తమ సైనికులను వెంటపెట్టుకుని జయంత్, మంత్రవాది రాయదుర్గంవైపు ప్రయాణం సాగించారు.

సమాలోచనా మందిరంలోకి చేరుకోగానే మంత్రవాది జయంతుతో అన్నాడు.

"ఆశించినదానికన్న సులభంగానే మనకు విజయం లభించింది ఇంతటితో మన శత్రువర్గమంతా సమసిపోయినట్టే లెక్క."

"అవును. ఈ యుద్ధానికి మనం ముందుగా చేసుకున్న ఏర్పాటులన్నీ వ్యర్థమే అయ్యాయి," జయంతన్నాడు.

"ఎందుకయినా మన జాగ్రత్తలో మనం ఉండడం మంచిదేగా," మంత్రవాది అంటున్న సమయంలోనే ఒక భటుడు పరుగెత్తుకుంటూ అక్కడికి వచ్చాడు.

"ఏం జరిగింది?" మంత్రవాది ఆతురతగా ప్రశ్నించాడు.

"ఖైదు గదిలో ప్రవేశపెట్టగానే కిశోర్‌గారు తన దగ్గర ఉన్న చిన్న కత్తితో ఆత్మహత్యచేసుకున్నారు," భటుడు కంగారుపడుతూ సమాధాన మిచ్చాడు.

ఈ వార్త జయంతుకు, మంత్రవాదికి ఆశ్చర్యాన్ని కలిగించింది. కిశోర్ అనవసరంగా తమ మీదికి దండెత్తి వచ్చి ఇంత గొడవ చేసినా అతని మరణానంతరం ఈ ఇద్దరికీ అతని మీద జాలి కలిగింది.

అనంతరం జయంత్ మంత్రవాదికేసి చూసి అడిగాడు.

"మరి మనం భూగృహానికి ప్రయాణం కావడమెప్పుడు?"

"వెంటనే. ఒక వ్యక్తినిక్కడ పరిపాలకుడుగా నియమించి మనం వెళ్దాం," అన్నాడు మంత్రవాది.

భూగృహంలో లావణ్యను చూడలేకపోయినా కనీసం భవానినైనా చూడడాని కవకాశం చిక్కుతుందని జయంత్ ఆనందించాడు. అక్కడికి ప్రతాప్, తండ్రిగారు వగైరా కూడా రావచ్చు.

మంత్రవాదికి కూడా ఓసారి నరేంద్ర మహారాజుగారిని చూసుకోవాలని చాలా కుతూహలంగా ఉంది. ఇంతే కాకుండా భూగృహంలో జరిగే ఖైదీల విచారణ చాలా ఆహ్లాదకరంగా ఉండవచ్చు. ఒక్కొక్కరి చరిత్రలోను ఎన్నో నిగూఢమైన రహస్యాలుంటాయి. అవన్నీ బయట పడుతూంటే వినేవారి కుతూహలం పెరుగుతూ ఉంటుంది.

ముఖ్యంగా నరసింగభూపతి, యమదూతకు సంబంధించిన విషయాలు తెలుసుకోవాలని మంత్రవాది చాలా కుతూహల పడ్డాడు.

ఆ మరునాడే జయంతు, మంత్రవాది రాయదుర్గంలో పరిపాలనా సందర్భంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి తాము భూగృహానికి ప్రయాణం కట్టారు.

భూగృహంలో రఘువీర్ మహారాజు పట్టాభిషేకోత్సవం వైభవంగానే జరిగింది. కళ్యాణి మహారాణిగా అర్ధాసనాన్ని ఆక్రమించింది. ఇప్పటివరకు ఆ స్థానాన్ని ఆక్రమించి ఎన్నో విచిత్ర గాథలకు, సంఘటనలకు కారకురాలైన మహామాయ కూడా పట్టాభిషేకోత్సవాన్ని తిలకించే ఏర్పాటు చేయ బడింది.

ఆ ఉత్సవానికి అతిథులుగా చాలామంది బంధుమిత్రులు వచ్చారు. అందులో ముఖ్యంగా చెప్పుకోదగినవాళ్లు నరేంద్ర మహారాజు, ఆయన పుత్రులు, అనుచరులు.

ప్రతాప్ కూడా మద్రరాజ్యాన్నుంచి బయలుదేరి వచ్చాడు. ఈ మధ్య అతను వర్మదనుగాని కిరణ్మయినిగాని చూసి చాలా కాలమైంది. అంచేత ఎలాగైనా ఓసారి వాళ్లను భూగృహంలో కలుసుకోవడం సంభవించ వచ్చుననే నమ్మకంతో ప్రతాప్ అక్కడికి వచ్చాడు.

ప్రతాప్ తాను మద్రరాజ్యానికి వెళ్లగానే జరిగిన విచిత్ర సంఘటనను గురించి నరేంద్ర మహారాజాదులకు వివరించి చెప్పాడు. మంజులకు సంబంధించిన ఆ సంఘటనను గురించి వినగానే అందరూ విస్మయాన్ని పొందారు.

అంతకుమించి, రాయదుర్గంమీద కిశోర్ దండయాత్ర, దాని ఫలితానికి సంబంధించిన వివరాలు అందరికీ మరింత ఆశ్చర్యాన్ని కలిగించాయి.

"ఇక మద్రరాజ్యం, రాయదుర్గం పూర్తిగా మన అధీనం లో ఉండవలసిన దేశాలే. వాటికి సంబంధించిన సమర్థులైన

వారసులు ఎవరూ లేరనే చెప్పవచ్చు." అన్నాడు నరేంద్ర మహారాజు చివరికి.

"అవును. కిశోర్ వగైరాలు బ్రతికిఉంటే, పోలీ వాళ్ల కోరిక ప్రకారం ఆయా రాజ్యాలను వాళ్ళ కప్పగించి వాళ్లను మనకు సామంతులుగా చేసుకునేవాళ్ళం. ఇప్పుడటువంటి దేమీ సంభవం కాదుగా!" అన్నాడు మంత్రి తంత్రవహి.

పట్టాభిషేకోత్సవానంతరం ఆనాటి సాయంకాలం అందరూ ఒకచోట సమావేశమయ్యారు. కాసేపు ఇష్టాగోష్టి జరిగిన అనంతరం బాబాజీ నెమ్మదిగా అన్నాడు.

"ఈరోజు నిజంగా చాలా ఆనందకరమైనది. కలలో సైతం ఊహించలేనంతటి విచిత్రమైన దారుణ సంఘటనల అనంతరం మిత్రుల్లం, ఆప్తులం ఒక చోట చేరాం. ఈ సందర్భంలో గడచిన దారుణ సంఘటనలకు కారకులైన దుర్మార్గులను విచారించి శిక్షించడం అవసరం అని నేను భావిస్తున్నాను. అందుచేతనే రఘువీర్ మహారాజుగారి ఆజ్ఞ ప్రకారం నేను అక్కడక్కడా ఉన్న ఖైదీల నందరినీ ఇక్కడికి రప్పించాను."

"మీ ఉద్దేశం బాగుంది. ఇప్పుడు జరగబోయే విచారణ అనేకమందికి గుణపాఠం కాగలదు," అన్నాడు నరేంద్ర మహారాజు.

"అంతేకాదు. ఈ మధ్య జరిగిన విచిత్రమైన సంఘటనలు కుతూహలాన్ని కలిగించేవిగాను ఔత్సుక్యాన్ని రేపేవిగాను ఉన్నాయి. ఖైదీల విచారణ సందర్భంలో మరి కొన్ని ముఖ్య సంఘటనలు, విషయాలు తెలియడానికి అవ

కాశం ఉంది. అవి తెలుసుకోవాలనే కుతూహలంతోనే నేనిక్కడకు వచ్చాను," అన్నాడు మంత్రవాది.

"ఈ సమావేశంలో విచారించబడే వ్యక్తు లెవరు?" తంత్రవహి అడిగాడు.

"మహామాయ, మంత్రి సాధు, బికారి మంథర వగైరాలు," బాబాజీ సమాధాన మిచ్చాడు.

"ఇంతేకాదు. వీళ్ళందరి నేరాలతోను ఎంతో కొంత సంబంధంఉన్న యమదూతనుకూడా తప్పకుండా విచారించవలసి ఉంది."

అకస్మాత్తుగా వినిపించిన ఈ మాటలు అందరినీ ఆశ్చర్యంలో ముంచాయి. ఈ మాటలు విన్న యమదూత మనః పరిస్థితిని గురించి చెప్పడానికి వీలుకాకుండా ఉంది. అతనెంతో కంగారుపడుతూ తనచూపుల్ని ఆ మాటలు వచ్చిన వైపుకు పోనిచ్చాడు.

అప్పటికే అందరి చూపులూ ఆ ప్రక్కకు తిరిగాయి. ఒక ప్రక్కగా నిలబడి ఉన్న ఇద్దరు ముసుగు వ్యక్తులు అందరికీ కన్పించారు. ఆ వ్యక్తులెవరో తెలిసిన యమదూత తేలు కుట్టిన దొంగలా మౌనం వహించాడు.

ఆ ముసుగు వ్యక్తులెవరో వాళ్ళక్కడికి ఎలా రాగలిగారో తెలియక రఘువీర్ మహారాజు తికమక పడసాగాడు. బాబాజీ మందహాసం చేస్తూ వాళ్ళ వంకచూసి అన్నాడు.

"యమదూత జీవితం అగాధమైన సముద్రం వంటిది. అందులో జరిగిన అనేక దారుణ సంఘటనలు, సత్కృత్యాలు అందరూ వినదగినవే అని నా ఉద్దేశం. అతనేక విధా

లుగా నరేంద్ర మహారాజుగారికి, రఘువీర్ మహారాజుకు అపకారాలుచేసిఉన్నా అంతకు మించిన ఉపకారాలు కూడా చేయకపోలేదు. అందుచేత అందరూ అతనిని క్షమించి వదలివేయడానికి నిశ్చయించుకున్నా అతని జీవిత గాథను తెలుసుకోడం మంచిదేనేమో!"

యమదూతకు బాబాజీ అన్న మాటలు బాధ కలిగించాయి పరిస్థితులిలా పరిణమిస్తాయని అతనెన్నడూ అనుకోలేదు. లేకపోతే అతనీ సమావేశంలో పాల్గొనేవాడే కాదు.

ఎందుకో యమదూతకు తన గత జీవితంలోని సంఘటనలను తలచుకుంటే చెప్పరానంత భయం! అలాంటిది ఆ సంఘటనలను గురించి లోకానికి తెలియచెప్పడంకంటే బాధాకరమైంది మరేముంటుంది!

"నరసింగభూపతిగారిని ఎక్కడున్నా వెదకి తీసుకు వస్తానని యమదూత రాయదుర్గంలో హామీ ఇచ్చాడు. అలాగే చేశాడు కూడా. అతను అసలు నరసింగభూపతిని వెదకి తీసుకువచ్చిన వెంటనే అతనిపై ఆరోపించబడిన నేరాలను గురించి విచారించడానికి అప్పుడే నిర్ణయించబడింది. ఆ ప్రకారం ఇప్పుడతనిది కూడా విచారించడం భావ్యమే ఔతుంది." మంత్రవాది బాబాజీతో అన్నాడు.

కొందరు యమదూతను గురించి ఆలోచిస్తూండగా మిగిలిన కొందరు ఒక ప్రక్కగా నిలబడి ఉన్న ముసుగు వ్యక్తులను గురించి ఆలోచించసాగారు.

"నేరస్థులను విచారించేప్పుడు మేంకూడా సమావేశంలో పాల్గొనడానికి అనుమతించవలసిందిగా మేం కోరుతున్నాం.

మేం మీ అందరి క్షేమాన్నీ కోరే వాళ్లమే కాబట్టి మేమిక్కడ విచారణ సందర్భంలో నిలబడి ఉండడంవల్ల మీకేలాంటి నష్టమూ కలగదని గట్టిగా చెబుతున్నాం." అందులో ఒక ముసుగు వ్యక్తి రఘువీర్ మహారాజు వంక చూస్తూ అన్నాడు.

"మీ రెవరో తెలియచెబితే మీకు కలిగే నష్టమేమీ ఉండదనుకుంటాను," మహారాజు అన్నాడు.

"మాకు నష్టమేమీ లేదు. కాని ఖైదీల విచారణ ముగిసే వరకు మేం బయటపడకుండా ఉండడమే మా ఉద్దేశం," ఒకతనన్నాడు.

కాసేపా సమావేశ స్థలంలో నిశ్శబ్దం ఆవరించింది. ఎవరికి వాళ్లు ఏం మాట్లాడడానికీ తోచక మౌనం వహించారు.

"మీకు మామీద ఇంకా సంశయంగా ఉంటే మేం బాబాజీగారితో ప్రత్యేకంగా కాసేపు మాట్లాడతాం. ఆ తర్వాత వారి ఇష్టానుసారం మీరు చేయవచ్చు," అన్నాడు తిరిగి ఆ ముసుగు వ్యక్తులలో ఒకడు.

రఘువీర్ మహారాజు వెంటనే తన ప్రక్కన కూర్చుని ఉన్న బాబాజీ వంక చూశాడు. బాబాజీ లేచి ఆ ముసుగు వ్యక్తులు నిలబడి ఉన్న చోటికి వెళ్ళాడు. పిమ్మట ముగ్గురూ సొరంగ మార్గంలో వెనక్కి వెళ్ళారు.

ఆ ముగ్గురి మధ్య జరిగిన సంభాషణల వివరాలేమిటో తెలియవు కాని బాబాజీ చిరునవ్వుతో తిరిగివచ్చి రఘువీర్ మహారాజు దగ్గరగా యథాస్థానంలో కూర్చున్నాడు.

ఆ వ్యక్తుల నిద్దరినీ ఇక్కడ ఖైదీల విచారణ సందర్భంలో ఇక్కడ ఉండనివ్వడం మనకే శ్రేయస్కరమని నా అభిప్రాయం." బాబాజీ అన్నాడు.

"మీ అభిప్రాయం ప్రకారం వాళ్ళిద్దరూ ఇక్కడ నేరస్థుల విచారణ సందర్భంలో ఉండడానికి అనుమతిస్తున్నాను," రఘువీర్ మహారాజు అన్నాడు.

ముందు మహామాయను రప్పించవలసిందిగా మహారాజు బాబాజీతో అన్నాడు. బాబాజీ భటులకావిధంగానే ఆజ్ఞాపించాడు. కాసేపట్లో మహామాయ అక్కడికి తీసుకురాబడింది.

ఆమె ముఖంలో విచారరేఖలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. తలవంచుకుంది. సమావేశంలో పాల్గొన్న వ్యక్తులను తలెత్తి చూడగల సాహసం ఆమెలో లేకపోయింది.

"రఘువీర్ మహారాజుగారిని, ఆయన పట్టమహిషిని మోసగించి వాళ్ళనేక బాధలకు లోనయ్యేట్టుగా చేసిన నేరం నీ మీద ఆరోపించబడుతోంది. ఈ సందర్భంగా నువ్వు చెప్పకోదలచుకున్న విషయాలేమైనా ఉన్నాయా?" బాబాజీ మహామాయ వంక చూసి ప్రశ్నించాడు.

ఆమె వంచిన తల ఎత్తకుండా నెమ్మదిగా అంది.

"తుదిక్షణంవరకు నన్ను అధికార వ్యామోహం పట్టి పీడించిందని నేను అంగీకరిస్తాను. అయితే ఏమీ ఎరగని అమాయకురాలినిగా ఉన్న రోజుల్లో మంత్రి సాధు మా తండ్రి దగ్గర చాలా డబ్బు లంచంగా పుచ్చుకుని నన్ను

రఘువీర్ మహారాజుగారికి పట్టమహిషిగా చెయ్యడానికి వాగ్దానం చేశాడు.

"అందుకనేక కుతంత్రాలను పన్నిన మాట వాస్తవమే. చివరికి వివాహానంతరం ఇక్కడికి తీసుకురాబడుతున్న కళ్యాణిగారి స్థానంలో నన్ను కూర్చోబెట్టేందుకు ఏర్పాట్లన్నీ చేయించాడు.

"మహారాణిగా నేను ఇక్కడికి వచ్చింతర్వాత కూడా మంత్రిసాధు నాకెన్నో దుర్బుద్ధులు నేర్పాడు. మహారాజును హతమార్చి నన్ను రాజ్యానికంతటికీ మహారాణిగా చేస్తానన్నాడు. లేకపోతే నామీద లేనిపోని నేరారోపణలు చేసి మహారాజుగారి దృష్టిలో నన్నొక నీచురాలినిగా చేస్తానన్నాడు.

"చివరి కతని మాటలు నేను వినక తప్పలేదు. ఫలితంగా జరిగిన సంఘటనలు మీకు తెలిసినవే. ఆ తర్వాత భూగృహాన్ని, రాజ్యాన్ని నిలుపుకోవాలనే వాంఛ కారణంగానే ప్రతాప్ జయంత్ వగైరాలను బంధించడం సంభవించింది."

మహామాయ కంఠం బొంగురు పోయింది. ఇంకా ఎక్కువ సేపు మాట్లాడే శక్తి ఆమెలో లోపించినట్టుంది.

"రఘువీర్ మహారాజుగారు ఏదో వ్యాధితో మరణించారని మీరు ప్రకటన చేసినప్పుడు ఆయనను మీరు ఖైదులో ఉంచారుకదూ?" ముసుగు వ్యక్తులలో ఒకతను మహామాయను అడిగాడు.

"మహారాజుగారిని మోసగించి సంహరించడానికి మంత్రి సాధు ప్రయత్నించాడు. కాని అలా చేయటానికి నా మనస్సెందుకో అంగీకరించలేదు. ఆయనను చంపకుండా ఖైదులో పెడదామని నేను మంత్రితో అన్నాను. అతనందుకు అంగీకరించాడు. అయితే మహారాజుగారు ఏమయ్యారో అనే అనుమానం ప్రజలకు కలగకుండా ఆయన ఏదో వ్యాధితో మరణించినట్టు మేం ప్రకటించాం," మహామాయ సమాధాన మిచ్చింది.

"అయితే మహారాజుగారిని చంపకుండా ఆయనను ఖైదులో ఉంచేట్టు చేయడంలో నీ ఉద్దేశం చెబుతావా?"

"పెద్ద ఉద్దేశమంటూ ఏం లేదు. ఎంచేతనో ఆయనను హతమార్చడానికి నా మనస్సు అంగీకరించలేదు."

"ఇదంతా నటన. భూగృహానికి సంబంధించిన పూర్తి రహస్యాలు నీకు తెలియవు. నీకు తెలియని ఎన్నో విషయాలు మహారాజుగారికి తెలుసు. ఖైదులో ఉన్న ఆయనను ఎలాగైనా బంధించి ఆ రహస్యాలను కొన్నిటినైనా తెలుసుకోడంకోసం ఆయనను చంపకుండా చేశావు. అవునా, కాదా?" ముసుగు వ్యక్తులలో ఒకతను గంభీరంగా ప్రశ్నించాడు.

ఈ ప్రశ్న విని అదిరిపడిన మహామాయ కంగారుగా ఆ ముసుగు వ్యక్తివంక తలెత్తి చూసింది. అదే సమయంలో ఆ వ్యక్తి తన మొఖంమీది ముసుగును కొంచెం తొలగించాడు. ఒక అస్పష్టమైన ఆకారాన్ని అందరూ చూశారు. కాని

మహామాయ మాత్రం అతనివంక చూడగానే భయంకొద్దీ కెవ్వున కేకపెట్టి నేలమీదికి ఒరిగిపోయింది.

ఈ సంఘటన అక్కడ ఉన్న అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆ ముసుగు చాటున దాగిఉన్న వ్యక్తి ఎవరో తెలుసుకోవాలనే కుతూహలం అందరిలోనూ ఎక్కువైంది. కాని అందుకు తగిన అవకాశం మాత్రం చిక్కలేదు.

"ఇక ఈ మెను తీసుకువెళ్ళి ఖైదులో ఉంచడం మెరుగు. ఇంకా విచారించవలసిన విషయాలేమైనా ఉంటే తరువాత తెలుసుకోవచ్చు," అన్నాడా ముసుగు వ్యక్తి మందహాసం చేస్తూ.

బాబాజీ సంజ్ఞ ప్రకారం అక్కడ ఉన్న భటులు సగం స్పృహ కోల్పోయి ఉన్న మహామాయను అక్కడి నుంచి తీసుకువెళ్ళారు. కాసేపు ఆ స్థలంలో నిశ్శబ్దం ఆవరించింది. ఎవరికీ ఏం మాట్లాడ్డానికీ తోచలేదు.

రెండవ ముసుగు వ్యక్తి బాబాజీవంక చిరునవ్వుతో చూసి 'ఈసారి మంథరను రప్పించండి,' అన్నాడు

మరుక్షణంలో మంథర అక్కడికి తీసుకురాబడింది. అక్కడ సమావేశమై ఉన్న పెద్దలందరి ఎదుట తలెత్తుకోడానికి భయపడుతున్న మంథరను చూసి బాబాజీ అడిగాడు.

"నీకు, మహామాయకు స్నేహం ఎప్పటినించీ ఆరంభమైందో చెప్పగలవా?"

"షుమారు మూడు సంవత్సరాలనించి," మంథర సమాధాన మిచ్చింది.

"అంతకుముందు ఆమె ఎవరో నీకు తెలియదన్నమాట!"

"సరిగా తెలియదు."

"ఆమెతో స్నేహం ఏర్పడినప్పటినించీ ఆమె చేసిన ప్రతి పనిలోను నువ్వు సాయం చేశావా?"

"అన్ని పనుల విషయం నాకు తెలియదు. ఆమె సాయం చేయమనికోరిన పనులన్నీ చేశాను."

"ఆమె ముఖ్యంగా తన ఖైదీల నందరినీ భవనంలో బంధించి ఉంచిన మాట నిజమేనా?"

"అది పేరుకు నాభవనం కాని నిజానికది ఆమెదే అందులో నన్ను ఉండమని ఆమె నియమించింది. తరువాత అనేకమంది ఖైదీలను అక్కడికి పంపిస్తూ వచ్చింది."

బాబాజీ ఇంకేమీ అడగలేదు. రెండవ ముసుగు వ్యక్తి మంథర వైపు తిరిగి అడిగాడు.

"మీకు, మహామాయకు ఏదైనా బంధుత్వముందా?"

"అలాంటిదేమీలేదు." మంథర వెంటనే సమాధానమిచ్చింది.

"మహామాయ తండ్రి మీకు బాగా తెలుసుననుకుంటాను."

"ఆయనెవరో నాకు తెలియదు. నేనెప్పుడూ చూడలేదు."

రెండవ ముసుగు వ్యక్తి కొంచెం కోపంగా బిగ్గరగా అరిచాడు.

"నా దగ్గర అబద్ధాలాడి ప్రయోజనంలేదు. నీ పుట్టుపూర్వోత్తరాలన్నీ నాకు తెలుసు."

మంథర మాట్లాడలేదు. మౌనం వహించింది.

"భవానీపురం రాకముందు నువ్వు వేశ్యగా బ్రతుకు తున్నావుకదూ ?" రెండవ ముసుగు వ్యక్తి మంథర నడిగాడు.

మంథర మనస్సునీ మాట కలవరపరచింది. ఆ వ్యక్తి తన రహస్యాలు పూర్తిగా తెలిసినవాడెవడో అయి ఉండా లని భయపడిపోయింది. ఈ సందర్భంలో ఏం మాట్లాడినా తనకే అపాయకరమనే ఉద్దేశంతో మారుపలకకుండా నిశ్శబ్దంగా నిలబడిపోయింది.

"ఇక ఈమెను పంపివేయవచ్చు. ఇంకా ఎక్కువ ప్రశ్నలడిగికూడా ప్రయోజనంలేదు," ఆ వ్యక్తి పరిహాసంగా అన్నాడు.

మంథరను భటులు వెనక్కు తీసుకు వెళ్ళిపోయారు. ముసుగు మనుషులిద్దరూ రఘువీర్ మహారాజువంక తిరిగి అన్నారు.

"ఇక ఈ పూట మేం చూసుకోవాల్సిన అవసరమైన పనులున్నాయి. వెళ్ళిపోతాం. మిగిలిన ఖైదీలను మీరు విచారించుకోండి. ఒక్క యమదూతను విచారించే రోజు మాత్రం మేం తప్పకుండా వస్తాం."

ఈ మాటలని మహారాజుగారి జవాబు నాశించకుండానే ఆ ఇద్దరు ముసుగు వ్యక్తులూ వెనక్కి వెళ్ళిపోయారు. యమ దూతకు మాత్రం వాళ్ళ ప్రవర్తన చాలా వింతగా కనిపిం చింది. తనను విచారించే రోజున మళ్లీ వస్తారట. అంటే తనకు సంబంధించిన రహస్య విషయాలేమైనా బయట పెడతారేమో !

వర్షం కురిసి వెలిసినట్టుగా ఆ గదిలో నిశ్శబ్దంగా ఉంది. బాబాజీ వగైరాలు వేరే ఏవో పనులమీద వెళ్ళారు. సమావేశం నాటికి ముగిసింది.

## 9

"ఆ ముసుగు వ్యక్తు లెవరో తెలుసుకోవాలని చాలా కుతూహలంగా ఉంది. వాళ్ళకు మహామాయ, మంథర వగైరాలకు సంబంధించిన రహస్యా లెలా తెలిశాయో!" అన్నాడు మంత్రవాది నేపాళితో.

"ఎవరో ఇద్దరు వ్యక్తులు తమను తాము దాచుకోడానికి ప్రయత్నిస్తే లోకం ఊరుకుంటుందా?" నేపాళి అన్నాడు.

"అయితే ఆ వ్యక్తుల ననుసరించి వెళ్ళి వాళ్ళ సంగతులు తెలుసుకుందామంటావా?"

"దానికోసం ఇద్దరం దేనికి? నే నొక్కడినే వెళ్ళి వాళ్ళ నివాసస్థలం వగైరా తెలుసుకువస్తాను."

"నా ఉద్దేశంలో ఆ ముసుగు వ్యక్తులకు సంబంధించిన వివరాలు బాబాజీకి తెలిసి ఉంటాయి. అయినా ఆయన ఆ విషయాలను ఇతరులకు చెప్పకుండా దాస్తున్నాడు," మంత్రవాది అన్నాడు.

"అలా చెయ్యమని వాళ్ళు బాబాజీని కోరి ఉండవచ్చు. ఏది ఏమైనా నేను వెంటనే బయలుదేరి వెళ్ళి ఆ వ్యక్తులకు సంబంధించిన వివరాలు సేకరించుకు వస్తాను," నేపాళి మంత్రవాదితో అని అక్కడినుంచి బయలుదేరాడు.

దూరంగా [illegible]లమీద వెళ్తున్న ముసుగు వ్యక్తులమీద ఒక కన్ను వేసి నేపాళికూడా గుర్రంమీద ప్రయాణం చేయసాగాడు. దట్టమైన అరణ్యాన్ని, కొండల బారును దాటి వాళ్ళు చాలా దూరం [illegible] ఆ వెనకే నేపాళి కూడా వెళ్తున్నాడు.

ఇంత దూరా[illegible]కి వచ్చిన ఆ వ్యక్తులెవరై ఉంటారా [illegible]పల తర్కించుకోసాగాడు. అయినా అతని ఆలోచన కందినంతవరకు ఈ [illegible]లలో [illegible]క్యం కలిగించుకోగల వ్యక్తులెవరో అంతు చిక్కలేదు.

అకస్మాత్తుగా నేపాళి చూపులు కుడిచేతివైపునుంచి చెట్ల చాటుగా దూసుకు వస్తున్న ఒక గుర్రంమీద పడ్డాయి. ఆ గుర్రం చాలా దూరాన ఉండడంవల్ల దానిమీదఉన్న మనిషి ఎవరో నేపాళి గుర్తుపట్టలేకపోయాడు. ఆ గుర్రం కూడా ముసుగు వ్యక్తుల వైపే పరుగెడుతున్నదని అతను గ్రహించాడు.

అప్పటికి సూర్యడస్తమించి చాల సేపయింది. అరుణ కాంతులుకూడా అంతరించాయి. చీకటి నెమ్మదిగా అన్ని దిక్కులను ఆక్రమిస్తోంది. ఆకాశంలో అక్కడక్కడా చిన్న చిన్న నక్షత్రాలు మిణుకు మిణుకుమంటూ మెరుస్తున్నాయి. చంద్రుడింకా గగనరంగంలోకి ప్రవేశించలేదు.

కొంతదూరం వెళ్ళేసరికి నేపాళికి ఎదురుగా కొండల బారొకటి కనిపించింది. అతని చూపులు ముందుకి వెళ్తున్న ముసుగువ్యక్తులమీదే ఉన్నాయి. అప్పుడప్పుడూ మాత్రం

మరొక ప్రక్కనించి వాళ్ళననుసరిస్తున్న రౌతు వైపు పరీక్షగా చూస్తున్నాడు.

ముసుగు వ్యక్తులు గుర్రాల నొకచోట వదలి కాలినడకన ముందుకు సాగారు. నేపాళి వాళ్ల వంక చూస్తూండగానే వాళ్ళ ననుసరించి వెళ్తున్న రౌతుకూడా గుర్రం దిగి నడక ప్రారంభించాడు. ఇక తానుకూడా గుర్రాన్నక్కడ వదలి ముందుకు నడచి వెళ్లడం శ్రేయస్కరంగా ఎంచాడు నేపాళి.

చీకటి దట్టమౌతున్నకొద్దీ ముందు వెళ్తున్న మనుషులు సరిగా కనిపించడంలేదు. నేపాళి పరీక్షగా వాళ్ల వంక చూస్తూ ముందుకు నడచిపోసాగాడు.

కొండలబారును సమీపించగానే దానిలో వరుసగా గుహలెన్నో ఉన్నట్టు నేపాళి గ్రహించాడు. ముసుగు వ్యక్తులిద్దరూ ఒక గుహలోకి ప్రవేశించడం, ఆ వెనకే తాను చూసిన రౌతుకూడా అదే గుహలో ప్రవేశించడం నేపాళి చూశాడు.

ఆ గుహను సమీపించగానే నేపాళి ఒక్క క్షణం అటూ ఇటూ పరకాయించి చూశాడు. గుహ లోపలినించి ఎటువంటి చప్పుడూ అతనికి వినిపించలేదు. ఆ చుట్టుప్రక్కల మరెవరూ లేరనికూడా అతను నిర్ణయించుకుని గుహ లోపలికి అడుగు పెట్టాడు. గుహలోంచి ఎక్కడికో సొరంగ మార్గం ఉండి ఉంటుందని అతని అంచనా.

గుహలో బాగా చీకటిగా ఉంది. వెంటనే అతను తన దగ్గరఉన్న ఒక కొవ్వొత్తిని తీసి వెలిగించాడు. దాని వెలు

గులో ఒకసారి గుహ నాలుగు వైపులకూ తన చూపులు పరుగెత్తించాడు.

ఒక మూలగా ఉన్న సొరంగ మార్గం అతని కంట పడింది. ఈ మార్గాన్నే ముందు ముసుగు వ్యక్తులు, తర్వాత రాతుకూడా వెళ్ళి ఉంటాడని నేపాళి అనుకున్నాడు.

ఎందుకైనా మంచిదని చేతిలో ఉన్న కొవ్వొత్తిని ఆర్పి ...పెట్టాడు. ఇంతలో వెనకనించి ఏదో అడుగుల చప్పుడు అతనికి వినిపించింది. చీకటిలో ఒక ఆకారం సొరంగం వైపు రావడం అతను అస్పష్టంగా చూశాడు. - ఈ పరిస్థితిలో ఏం చెయ్యాలో తోచక ఎక్కడి వాడక్కడే నిలబడిపోయాడు.

మరుక్షణంలో దుప్పటిలాంటి వస్తువేదో నేపాళిని చుట్టి వేసింది. తర్వాత రెండు చేతులు తనను బలంగా పట్టుకున్నట్టతను గ్రహించాడు. ఆ వెంటనే అతని నరాలు బిగిసిపోనారంభించాయి కాసేపట్లో స్పృహకోల్పోయి క్రిందికి ఒరిగిపోయాడు.

మళ్ళీ స్పృహవచ్చేసరికి నేపాళి ఒక గదిలో బంధింపబడి ఉన్నాడు. ఓ మూలగా చిన్న దీపం వెలుగుతోంది. ఆ దీపపు కాంతిలో తన ప్రక్కగా మరొక వ్యక్తి బంధింపబడి ఉండడం అతను చూశాడు. ఆ వ్యక్తి వంక చూడగానే నేపాళికి ఆశ్చర్యం కలిగింది.

యమదూత కూడా తనతోపాటు ఆ గదిలో బంధింపబడడం నేపాళికి వింతగా ఉంది. ముసుగు వ్యక్తుల ననుస

రించిన రాతు యమదూతే అయి ఉంటాడనుకున్నాడు చివరికి నేపాళి.

యమదూతకు కూడా తన ప్రక్క నేపాళిని చూడగానే ఒక ప్రక్క సిగ్గు, మరొక ప్రక్క ఆశ్చర్యమూ కలిగాయి. ముసుగు వ్యక్తులు తన రహస్యాలుకూడా మహారాజాదుల ఎదుట బయట పెడతారేమోననే భయం యమదూతను పట్టుకు పీడించసాగింది. అందుచేత ఎలా [illegible] ంతి మాలుకుని తన రహస్యాలు బయ[illegible] లను కున్నాడు.

కాని యమదూత అనుకున్నట్టుగా జరుగలేదు. ముసుగు వ్యక్తుల్ని కలుసుకోకుండానే తను ఇతరుల చేతిలో చిక్క వలసి వచ్చింది. పైగా సామాన్యులనుకున్న ముసుగు వ్యక్తులు సొరంగ మార్గాలతో కూడిన భవనాలను కలిగి ఉండడం అతనికి ఆశ్చర్యాన్ని కలిగించింది.

"మీ రిక్కడి కెందుకు వచ్చారు ?" యమదూత నేపాళి నడిగాడు.

"మీ రెలావచ్చారో నేనూ అలాగే వచ్చాను," నేపాళి నవ్వుతూ జవాబిచ్చాడు.

ఇంతలో ఆ గది తలుపులు తెరచుకుని ఇద్దరు భటులు లోపలికి వచ్చారు. వాళ్ళను చూడగానే బందీ లిద్దరూ మౌనం వహించి వాళ్ళ వంక పరీక్షగా చూడసాగారు.

"మీ విషయం మా యజమానులకు తెలియచేయబడింది. సాధారణంగా ఇతరులు మా అనుమతిలేనిదే సొరంగంలో ప్రవేశిస్తే మరణశిక్ష మామూలు. కాని మీరు పూర్వజన్మలో

పుణ్యం కట్టుకుని ఉంటారు. మా యజమానులు మిమ్మల్ని మాత్రం వదలివేయమన్నారు," ఆ భటులన్నారు.

"మీ యజమానులెవరో తెలుసుకోవచ్చునా?" నేపాళి అడిగాడు.

"ఆ సంగతులన్నీ మీకనవసరం. నరేంద్ర మహారాజుకు సంబంధించిన వ్యక్తులని మీ మీద దయదలచి వదలివేస్తున్నాం-మారుమాట్లాడకుండా మీ దారిన మీరు వెళ్ళండి," అన్నాడొక భటుడు.

"అలా వెళ్ళిపోవడానికి నేనంగీకరించను. మీ యజమానులతో మాట్లాడడానికి నేనిక్కడికి వచ్చాను. అవి చాలా అవసరమైన విషయాలు. ఆ విషయాలు మాట్లాడందే నేనిక్కడినించి కదలను. ఈ సంగతి వాళ్ళతో చెప్పండి," అన్నాడు యమధూత.

"ఇవన్నీ అనవసరం. మా యజమానులు మీతో మాట్లాడడానికిష్టపడేమాత్రం అంగీకరించరు. మీరిక్కడినించి కదలకపోతే, ఇక్కడికెలా తీసుకు రాబడ్డారో అలాగే బయటికి పంపబడతారు," అన్నాడు రెండో భటుడు.

యమదూతకు, నేపాళికి ఏం చెయ్యాలో తోచలేదు. ఇద్దరి ప్రయత్నాలు నెరవేరలేదనే చెప్పవచ్చు. సులభంగా ముసుగు వ్యక్తుల వివరాలు తెలుసుకోవచ్చుననుకున్న నేపాళి ఆశ నిరాశ అయింది. తాను వచ్చిన పని కాకపోవడంతో యమదూత మరింత కంగారుపడసాగాడు.

"సరే. మమ్మల్ని బయటికి పంపండి," అన్నాడు చివరికి నేపాళి అందుకు యమదూత అంగీకారంకూడా లభించింతర్వాత.

ఆ భటులిద్దరూ నేపాళికి, యమదూతకు కళ్లగంతలు కట్టారు. చాలాదూరం నడిపించి చివరికి గుహ బయటికి తీసుకువచ్చి వదిలారు.

"ఇంకా మమ్మల్ని అనుసరించడానికి ప్రయత్నించి లాభం లేదు. ఈసారి తిరిగి ఈ సొరంగంలో అడుగుపెడితే దుష్ఫలితాల ననుభవించవలసి వస్తుంది," ఒక భటుడు చివరికి వాళ్ళను హెచ్చరిస్తూ అన్నాడు.

"అవిగో, అక్కడ మీ గుర్రాలు రెండూ సిద్ధంగా వున్నాయి. మేం చూస్తుండగా వాటిమీద భూగృహానికి వెళ్ళిపొండి. అక్కడ మీ కోసం మహారాజాదులు ఎదురు చూస్తూ ఉండి ఉంటారు," అన్నాడు మరొక భటుడు.

ఏమీ చెయ్యలేని పరిస్థితిలో నేపాళి, యమదూత తమ తమ గుర్రాల నెక్కారు. భూగృహంవైపు సాగిపోయారు. కొంతదూరం వెళ్ళి వాళ్లు వెనక్కి చూసేసరికి గుహ దగ్గర నిలబడి ఉండవలసిన ఇద్దరు భటులూ మాయ మయ్యారు.

"ఆ ముసుగు వ్యక్తులెవరో మీరేమైనా తెలుసుకో గలిగారా?" నేపాళి యమదూత నడిగాడు.

"ఆ విషయం తెలుసుకోవడంకోసమే నేనిక్కడికి వచ్చాను. కాని లాభంలేకపోయింది," యమదూత జవా బిచ్చాడు.

"నేనూ అందుకోసమే వచ్చాను. అయితే ఆ విషయాలు తెలుసుకోకుండా తిరిగి వెళ్ళడం నా కిష్టంలేదు. అందుకని ఏం చెయ్యాలా అని ఆలోచిస్తున్నాను."

"ఆలోచించి ప్రయోజన మేముంది!"

"నాకు మరో అనుమానం కలుగుతోంది. ఆ ముసుగు వ్యక్తులు, మనల్ని బయటకు పంపిన భటులు ఒకళ్ళేమోనని పిస్తోంది ఆలోచించి చూసినకొద్దీ.

యమదూతకు కూడా నేపాళి అనుమానం నిజమే నేమో అనిపించింది ఆలోచించినకొద్దీ. తామిద్దరూ వాళ్ళ ఎదుట పూర్తిగా మోసపోయారు. మరునాడు తన విచారణ సందర్భంలో ముసుగు వ్యక్తులు తన రహస్యాలు బయటపెడతారేమో నన్న భయం అతనిని వదలలేదు.

అసలు భూగృహానికి వెళ్ళడం మానేద్దామా అనుకున్నాడు ముందు యమదూత. కాని అలాచేస్తే తన కసలు పుట్టగతులుండబోవేమోనని మరింత భయపడ్డాడు.

తన రహస్యాలు బయటపడినా ఏదో విధంగా నరేంద్ర మహారాజాదులు తన నేరాలను క్షమించేట్టు తాను చేసుకోగలడు. తన నేరాలను క్షమిస్తానని ఆయన చిత్రగృహంలో తనకు మాట ఇచ్చారుకూడా. అలాంటప్పుడు ఇంతగా భయపడడం దేనికి!

యమదూత తనకుతానే ధైర్యం చెప్పుకున్నాడు. నేపాళి కూడా చివరికి తన ప్రయత్నాన్ని విరమించి భూగృహంలోకి వెళ్లడానికే నిశ్చయించుకున్నాడు.

ఇద్దరూ మౌనంగా భూగృహంవైపు తమ తమ ఆలోచనలలో మునిగిపోయి ప్రయాణం సాగిస్తున్నారు. గుర్రాలు

రెండూ అడవిలో అస్పష్టంగా కనిపిస్తున్న మార్గాన చీకటిలో నెమ్మదిగానే వెళ్తున్నాయి. అప్పటికి బాలచంద్రుడు ఆకాశ రంగంలోకి ప్రవేశించాడు.

## 10

బాబాజీ యమదూతవంక చూస్తూ అన్నాడు.

"యమదూత తన జీవితంలో ఎన్నో అపరాధాలు చేశాడని వాటిని కప్పిపుచ్చుకోడానికి ఇప్పుడు మంచి పనులు చేస్తున్నాడని నేనింతకుముందే చెప్పాను. ఈ రోజు యమదూత చేసిన నేరాలను గురించి విచారణ జరపవలసిందిగా రఘువీర్ మహారాజు గారి ఆజ్ఞ అయింది. యమదూత కేవలం రఘువీర్ మహారాజుకే కాక, నరేంద్రమహారాజాదులకుకూడా అపకారం చేసిన వ్యక్తి. అందుచేత ఈ అందరి ఎదుటా అతని నేరాలు విచారించబడడం భావ్యమనే నేను ఎంచుతున్నాను. ఇందుకు యమదూత ఏమంటాడో నేను తెలుసుకోవాలనుకుంటున్నాను."

ఆనాటి సమావేశంలో నరేంద్ర మహారాజు, రాకుమారులు, రఘువీర్ మహారాజు, నరసింగభూపతి మొదలైనవారందరూ పాల్గొన్నారు. మరొక గదిలోనుండి నర్మద, కళ్యాణి వగైరాలు కూడా ఈ విచారణ నాకర్ణించడానికి ఆతురత చెందుతున్నారు.

బాబాజీకి ఎదురుగా యమదూత కూర్చుని ఉన్నాడు. అతనికి కొద్ది దూరంలో ముసుగు వ్యక్తులిద్దరూ నిలబడి ఉన్నారు. వాళ్ళను కూర్చోవలసిందిగా రఘువీర్ మహారాజు కోరినా వాళ్ళలాగే నిలబడ్డారు.

యమదూత ఇలాంటి పరిస్థితి భూగృహంలో ఏర్పడుతుందని భావించలేదు. పైగా ఇప్పుడు తన ప్రక్కనే తన రహస్యాలెన్నో తెలిసిన ముసుగు మనుషులున్నారు. లేకపోతే తానేవో అబద్ధాలు చెప్పి తన అపరాధాలను కప్పిపుచ్చుకోడానికి ప్రయత్నించేవాడు. కాని ఇప్పుడలా జరగడానికి ఏ మాత్రం వీలులేదు.

యమదూత ఆలోచనలో మునిగిపోయి ఉన్నవాడల్లా బాబాజీ తనను గురించి ప్రసంగించడంతో ఈ లోకంలోకి వచ్చాడు. ఆయన మాట్లాడింతర్వాత దీనస్వరంతో నెమ్మదిగా అన్నాడు.

"నేనుచేసిన అపరాధాలు ఎవరూ క్షమించరానివని నాకు తెలుసు. అయినా వాటిని గురించి లోకానికి వెల్లడి చెయ్యడానికి నేను జంకుతున్నాను. ఏది ఏమయినా నేను అపకారం చేసిన మహారాజులలో ముఖ్యులిద్దరిక్కడ ఉన్నారు. ఈ ఇద్దరూ నన్ను నా అపరాధాలను గురించి వినికూడా క్షమిస్తారని నా ఆశ.

"ఏవో వికట పరిస్థితులలో ఒళ్లు తెలియని స్థితిల్లో నేను నేరాలు చేశాను. ఇప్పుడందుకు పశ్చాత్తాపపడుతూ ఆ నేరాలకు బదులుగా ఇప్పుడెన్నో సత్కార్యాలను చేయడానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నాను. చిత్రగృహంలో బంధింపబడిన నరేంద్ర మహారాజు గారిని విడిపించినప్పుడు నా అపరాధాలను ఆయన క్షమించేట్టుగా ఆయన వద్దనుండి వాగ్దానం పొందాను. అదే విధంగా రఘువీర్ మహారాజు

గారు కూడా నా అపరాధాలను క్షమించేట్టు మాట ఇవ్వ వలసిందిగా వేడుకొంటున్నాను."

రఘువీర్ మహారాజు బాబాజీ వంక ప్రశ్నార్థకంగా చూచాడు.

"యమదూత చేసిన కొన్ని అపరాధాల కారణంగా కొన్ని కష్టాల ననుభవించవలసి వచ్చినా రఘువీర్ మహారాజుగారికి అతను చివరి క్షణంలో సహాయం చేశాడు. అతను చేసిన మంచి పనుల ముందు అంతకు ముందు చేసిన నేరాలను మరచిపోయి అతనిని క్షమించవచ్చు ననుకుంటున్నాను," బాబాజీ రఘువీర్ మహారాజువైపు చూస్తూ అన్నాడు.

"యమదూత నా విషయంలో ఎంత సానుభూతి చూపిందీ నాకు తెలుసు. అందుచేత అతను గత జీవితంలో చేసిన నేరాలను క్షమించగలనని అతనికి వాగ్దానం చేస్తున్నాను," రఘువీర్ మహారాజు అన్నాడు.

ఈ మాట విన్న యమదూత ఆనందం పట్టలేకపోయాడు' తాను చేసిన నేరాలన్నీ క్షమించబడ్డాయి. ఇక తాను భయపడ వలసిన అవసరం ఏమాత్రంలేదు. ఒకప్పుడు అందరి దృష్టికీ దానవుడుగా కనిపించిన తానిప్పుడు మానవుడుగా కనిపించ వచ్చు.

"ఈ సందర్భంలో నేను యమదూతను రెండు మూడు ప్రశ్నలడిగి నా అనుమానాలను తీర్చుకోవాలనుకుంటు న్నాను," బాబాజీ అన్నాడు.

అవేమిటో అడగమన్నట్టుగా యమదూత బాబాజీ వంక చూశాడు.

"మహామాయ తండ్రికి, కళ్యాణికి బదులుగా ఆమెను రాణిగాచేసే ప్రయత్నం సందర్భంగా బికారి వ్రాసిన ఉత్తరాలను పెట్టెతోసహా నువ్వు నా దగ్గరికి పంపావు. నేనా సమయంలో భవనంలో లేకపోవడంచేత ఆ పెట్టెను మాలతి కిచ్చాడు నీ అనుచరుడు. అయితే నకలు నరసింగభూపతి వేషంలో నర్మద భవనంలో అందరినీ మోసగించడానికి ప్రయత్నించిన బికారి నీమీద నేరారోపణచేస్తూ ఆధారాలుగా చూపిన ఉత్తరాలకు సంబంధించి నన్నొక అనుమానం పీడిస్తోంది. ఆ ఉత్తరాలు నువ్వు వ్రాసినవేనా?"

యమదూత మందహాసం చేస్తూ అన్నాడు.

"నేను చేసిన నేరాలలో ఒకటిప్పుడు బయటపెట్టక తప్పదు. బికారి వ్రాసిన ఉత్తరాల పెట్టె నాకు దొరికింది. దాని ఆధారంగా బికారినీ, మంత్రిసాధును బెదిరించి నేను కోరిన ధనమిస్తే ఆ ఉత్తరాల పెట్టెను ఇచ్చేస్తానన్నాను. వాళ్ళందు కంగీకరించి నేను కోరిన ధనమిచ్చారు. అయితే నేను వాళ్ళను మోసగించాను. బికారి వ్రాసిన ఉత్తరాలను నేను స్వహస్తంతో నకలు చేశాను. వాటినొక పెట్టెలో పెట్టి వాళ్ళ కప్పగించాను. వాళ్ళు నన్ను నమ్మి ఆ పెట్టెను తెరచి చూడలేదు. అయితే ఆ ఉత్తరాలలో క్రింద బికారి సంతకం ఉన్నచోటును ఖాళీగావదిలాను. అదే నేనుచేసిన పొరపాటు. అందువల్ల ఆ కాగితాలు నాకే ముప్పుతెచ్చిపెట్టాయి. తర్వాత ఎప్పుడో ఆ కాగితాలను తీసి చూసిన సాధు, బికారి తాము

మోసపోయామని గ్రహించారు. అయితే బికారికొక ఆలోచన తట్టింది. ఉత్తరాలలో క్రింద సంతకాలులేని చోట్ల అతను యమదూత అని సంతకాలు చేశాడు. ఆ అక్షరాలు మాత్రం నేను వ్రాసినవి కావు. తిరిగి ఆ ఉత్తరాలను తీసిచూస్తే ఈ విషయం స్పష్టమౌతుంది. నకలు ఉత్తరాలన్నీ నా దస్తూరీలో ఉండడంవల్ల నేరం నా మీదకి వచ్చింది."

"ఇదంతా వింటూంటే యమదూత జీవిత చరిత్ర వినాలనిపిస్తోంది," అన్నాడు నరేంద్రమహారాజు.

"యమదూత మంచికో చెడ్డకో తన జీవిత చరిత్ర వ్రాసుకొన్నాడు. దానిని నేను పూర్తిగా చదవడం తటస్థించింది. అతను స్వయంగా తన కథ చెప్పుకోవడంకంటే నేనతని గాథను చెప్పడం సులభం. అందరికీ అంగీకారమైతే నేను చెబుతాను," అన్నాడు మొదటి ముసుగు వ్యక్తి.

అందరూ అందుకంగీకరించారు. ఆ ముసుగు వ్యక్తి యమదూత చరిత్ర చెప్పనారంభించాడు.

—: o :—

ముసుగు వ్యక్తులెవరు? యమదూత గత జీవితంలో చేసిన నేరాలేమిటి? ముసుగు వ్యక్తులకీ అతనికీగల సంబంధమేమిటి? తర్వాత ఏం జరిగింది? మొదలైన విషయాలు మహామాయ పదిహేడవ పుస్తకం 'చాకచక్యం'లో చదవండి.

ఏప్రిల్ 30 వ తేదీన వెలువడుతుంది.

మహామాయ—17

చాకచక్యం

మే 10 వ తేదీ లోపున వెలువడుతుంది.

మహామాయ-18

జయభేరి

ఏజెంట్లు శ్రద్ధవహించి సకాలంలో డబ్బు పంపి పుస్తకాలు తెప్పించుకోవలసిందిగా కోరుతున్నాం.

—— ౦ ——

వెలువడింది

అపరాధిని

అద్భుతమైన సాంఘిక నవల —

— ముద్దులొలికే త్రివర్ణ ముఖచిత్రం

అనువాదం: కనక మేడల

320 పేజీలు — వెల రు. 1.50 లేక రు. 1-8-0

ఏజెంట్లు తమ ఆర్డర్లను తక్షణం పంపాలి.

విజ్ఞాన సాహితి

టి. నగర్ : : మద్రాసు-17.

మే—సంచికకు ఇంకా ఆర్డర్లు పంపని ఏజెంట్లు
వెంటనే పంపాలి!




మహాభారతం సీరియల్, డిటెక్టివ్ సీరియల్ కథ, గొడ్డకాడబుడ్డోళ్ళు—, ఉమర్ ఖయ్యాం పాటలు, భానుడైరీ, భూమికథ, మరువలేని క్షణాలు, వెండితెర, ఆమె చేసిన నేరం మొదలైన రసవత్తర రచనలతో—ప్రఖ్యాత రచయితల కమ్మని కథలతో, అందాలుచిందే త్రివర్ణ ముఖచిత్రతో మే—సంచిక

వెల — 40 నయాపైసాలు

వెలలో మార్పును ఏజెంట్లు గమనించి డబ్బు పంపవలసిందిగా కోరుతున్నాం.

విజ్ఞాన సాహితి
టి. నగర్ :: మద్రాసు-17

మహామాయ—16

# రణరంగం

మహామాయ సీరియల్‌ను గురించి కొన్ని అభిప్రాయాలు—

*

"మహామాయ సీరియల్ తెలుగు పాఠకులలో విచిత్రమైన సంచలనాన్ని కలిగించింది. ఎవరిచేతిలో చూసినా ఈ పుస్తకాలే కనిపిస్తున్నాయి."

*

"ఈ రకమైన సాహిత్యం మన కెంతో అవసరం. కాశీ మజిలీలతో కల్పనా సాహిత్యం అంతం కాలేదని ఈ నవల నిరూపిస్తోంది."

*

"వినోదాన్ని, ఆహ్లాదాన్ని కలిగించే నవలలో దీనికి దేసాటి. ఇన్ని పుస్తకాలు సీరియల్ గా వెలువడినా పాఠకుల అభిరుచి ఏ మాత్రం తగ్గకపోవడమే దీని ప్రాశస్త్యానికి చిహ్నం."

A VIGNANA SAHITI Publication in Telugu